http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

గురువారం 5 మార్చి 2026

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## ఈ ఎన్నికల్లో విజిల్ మారుమోగుతుంది

- ఐపీఎల్‌లో సీఎస్‌కేకు విజిల్ వేస్తే ఎన్నికల్లో టీవీకే విజిల్‌కు ఓటేస్తారు
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు తనకు భావోద్వేగమన్న నటుడు విజయ్
- మిగతా పార్టీలకు సాధారణ ఎన్నిక అని వ్యాఖ్య



## 'రాజ్యసభ' బరిలో హేమాహేమీలు

- అభ్యర్థుల జాబితాను ఖరారు చేసిన బీజేపీ
- మహారాష్ట్ర నుంచి ఖాళీ అవుతున్న ఏడు స్థానాలకు గాను బరిలోకి నలుగురు కీలక నేతలు
- 16న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ తన పట్టును నిరూపించుకునే దిశగా అడుగులు




## రాజ్యసభకు నితీశ్ కుమార్?

- నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రాజ్యసభకు వెళ్లనున్నారా?
- నితీశ్ కుమార్ రేపు రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయనున్నారని కథనాలు
- రాజ్యసభకు ఎన్నికయ్యాక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తారని ఊహాగానాలు
- కుమారుడు నిశాంత్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారని కథనాలు

## ఆర్థిక పరిస్థితి... ఏంటీ?

రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాయడం సంచలనమైంది.

దీంతో నిజంగానే తెలంగాణ రాష్ట్ర ఖజానా నిల్ అయ్యిందా? అయితే రాహుల్ గాంధీకి 1000 కోట్లు ఇస్తానన్న రేవంత్ రెడ్డి వాటిని ఎలా చెల్లిస్తారన్న కిషన్ రెడ్డి మాట ఇప్పుడు వైరల్ గా మారింది.



### సీఎం రేవంత్ రెడ్డి ఖాజానా నిల్ అనడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గట్టి సవాళ్లు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిపై కేంద్రానికి డౌట్ వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఖాజానా నిల్ అనడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గట్టిగానే సవాళ్లు చేశారు. కేంద్రం నిధులు ఇస్తున్న రాష్ట్ర ఖజానా ఖాళీ అంటున్న రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాయడం సంచలనమైంది. దీంతో నిజంగానే తెలంగాణ రాష్ట్ర ఖజానా నిల్ అయ్యిందా? అయితే రాహుల్ గాంధీకి 1000 కోట్లు ఇస్తానన్న రేవంత్ రెడ్డి వాటిని ఎలా చెల్లిస్తారన్న కిషన్ రెడ్డి మాట ఇప్పుడు వైరల్ గా మారింది.రాష్ట్ర ఖజానా 'నిల్' అంటూ రాజకీయ వేదికలపై వినిపిస్తున్న మాటలు ఇప్పుడు కొత్త కామెడీ ట్రాక్‌లా మారాయి. ఎన్నికల సమయంలో - మిగతా3లో




## మహిళలకు బీమా పథకం

- తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్..
- త్వరలో కొత్త పథకం..
- వారి బ్యాంక్ ఖాతాలోకి రూ.10 లక్షలు..
- మహిళలకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది
- త్వరలోనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది
- ఇందుకోసం కొత్త బీమా పాలసీని తీసుకురానుంది

హైదరాబాద్

తెలంగాణలోని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. త్వరలో కొత్త పథకాన్ని వీరి కోసం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీకే ప్రభుత్వం రుణాలు అందిస్తోన్న విషయం తెలిసిందే. స్వయం సహాయక సంఘాల మహిళల కోసం రుణ సౌకర్యంతో పాటు ప్రమాద బీమా అందిస్తోంది. అయితే రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తూ మరణిస్తే.. కుటుంబంపై ఆ భారం - మిగతా3లో



## మరో నాలుగైదు వారాలు ఈ యుద్ధం కొనసాగవచ్చు

- రక్షణ రంగ కాంట్రాక్టర్లతో డొనాల్డ్ ట్రంప్ ఎమర్జెన్సీ మీటింగ్!
- రెండు రోజుల్లో అత్యవసర సమావేశం ఉండే అవకాశం
- ఇరాన్‌తో యుద్ధం కారణంగా తగ్గుతున్న క్షిపణులు, ఆయుధ సామాగ్రి
- ఆయుధ ఉత్పత్తిని త్వరితగతిన పెంచే అంశంపై చర్చించనున్న ట్రంప్



## పర్షియన్ గల్ఫ్, ఒమన్ ప్రాంతాల్లో చిక్కుకున్న భారత నౌకలు

- సముద్ర మార్గాల్లో చిక్కుకుపోయిన 37 భారత నౌకలు, 1,109 మంది నావికులు
- పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు
- హర్మూజ్ జలసంధి మూసివేత

## భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదగకుండా చేయడానికే

- అమెరికా అగ్రరాజ్య హోదాను నిలుపుకోవడానికి ప్రపంచ ఘర్షణలను ప్రోత్సహిస్తోంది
- 'సమీప భవిష్యత్తులో ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన దేశాలుగా భారత్, చైనా, రష్యా, అమెరికా ఉంటాయి
- అయితే, భారత్ లేదా చైనా తనతో పాటు సమాన శక్తులుగా ఎదగడాన్ని అమెరికా జీర్ణించుకోదు.
- ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయ ప్రతినిధి అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి (ఖమేనీ ప్రతినిధి)





## పశ్చిమాసియా యుద్ధంలోకి పాకిస్థాన్!


## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు



- ఇరాన్‌లో 165 మంది బాలికల మృతిపై కేటీఆర్ కామెంట్
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్
- ఈ యుద్ధాలు రాబోయే తరాలకు తీరని శోకాన్ని మిగిలిస్తాయని వ్యాఖ్య

హైదరాబాద్

ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానికి దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది. ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - మిగతా3లో



## ఆరంభంలోనే నిప్పులు

### మార్చి ఆరంభంలోనే మండిపోతున్న ఎండలు

- 36 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రత
- వాతావరణ శాఖ విడుదల చేసిన వెదర్ ఔట్ లుక్‌లో వెల్లడి
- ఉక్కపోత అధికంగా ఉండటంతో ప్రజల ఉక్కిరిబిక్కిరి
- మరి రానున్న రోజుల్లో పగలు, రాత్రి వేళల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం

హైదరాబాద్

ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎండలు మొదలయ్యాయి. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ఈ నెల, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏమిటనే ఆందోళన మొదలైటంది. వరంగల్ జిల్లా డోర్నకల్‌లో ఉష్ణోగ్రత మంగళవారం 36 డిగ్రీలకు చేరుతుంది. గత వారం రోజుల నుంచి ఉక్కపోత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరి రానున్న రోజుల్లో పగలు, రాత్రి వేళల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని తాజాగా వాతావరణ శాఖ విడుదల చేసిన వెదర్? ఔట్ లుక్‌లో ప్రకటించింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఒక నెల ముందుగానే సూర్యుడు సెగ కక్కుతున్నాడు. ఉదయం 11 దాటాక వీధులు నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. దీంతో ఎండలో బయటకు రావడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. ఇక మహబూబాబాద్? జిల్లా విషయానికి వస్తే ఈ జిల్లాకు సమీపంలో బొగ్గు గనులున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ఉంది. అలాగే దీనికి తోడు డోర్నకల్? నుంచి జనగామ వరకు - మిగతా3లో

# పర్షియన్ గల్ఫ్, ఒమన్ ప్రాంతాల్లో చిక్కుకున్న భారత నౌకలు

పశ్చిమ ఆసియాలో అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. ప్రపంచ రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి మూతపడటంతో అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ ప్రాంతాల్లో సుమారు 37 భారత నౌకలు నిలిచిపోయాయి. వీటిలో 1,109 మంది నావికులు ఉన్నట్లు కేంద్ర వర్గాలు తెలిపారు. వీటిలో కొన్ని నౌకలు ముడి చమురు, ఖాచీ+ని ఇండియన్? పోర్ట్?లకు రవాణా చేస్తున్నాయి. మరికొన్ని గల్ఫ్ దేశాల నుంచి పెట్రోలియం ఉత్పత్తులను తీసుకొచ్చేందుకు వెళ్తున్నాయి. కాగా, హర్మూజ్ జలసంధి మూసివేయడంతో రవాణాకు పూర్తిగా అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆయా కంపెనీలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తోంది. భారతీయ నావికుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల పశ్చిమాసియాలో తలెత్తిన ఘర్షణల కారణంగా ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. భారత్ తన చమురు అవసరాల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ క్రమంలో పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 37 నౌకల్లో అత్యధిక శాతం ముడి చమురును, ఎల్?ఎన్?జీని తీసుకొస్తున్నాయి. మరికొన్ని నౌకలు పెట్రోలియం ఉత్పత్తులను తీసుకురావడానికి గల్ఫ్ దేశాల వైపు వెళ్తుండగా మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ నౌకల రాకపోకలు ఆగిపోవడం వల్ల రాబోయే రోజుల్లో దేశీయంగా ఇంధన ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



### క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు

సముద్ర మార్గాల్లో తీవ్రతను గమనించిన కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. కేంద్ర షిప్పింగ్, ఓడరేవుల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నౌకాయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్విక్ రెస్పాన్స్ టీమ్?ను ఏర్పాటు చేశారు. ఇది వివిధ అథారిటీల మధ్య సమన్వయం చేస్తూ, నావికులు, వారి కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని ఈ టీమ్ అందించనుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) నిరంతరం షిప్పింగ్ కంపెనీలతో టచ్‌లో ఉంటూ నౌకల కదలికలను ట్రాక్ చేస్తుంది. నావికుల కుటుంబాల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్సీల (ఆర్పీఎల్ఎస్) అందుబాటులోకి తెచ్చారు.

### భారత మిషన్లతో సన్నిహిత సమన్వయం

ఇదిలా ఉండగా, కేంద్రం నౌకాదళాన్ని కూడా అప్రమత్తం చేసింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో భారత వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించేందుకు 'ఆపరేషన్ సంకల్ప్' వంటి చర్యలను వేగవంతం చేసే ఆలోచనలో ఉంది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ (×ఖీజ-×ూ=), గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా, హర్మూజ్? జలసంధి మూసివేయడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలక మార్గమైన జలసంధి గుండా ప్రయాణించే చమురు ట్యాంకర్లకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని, ముఖ్యంగా ఇంధన సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు అమెరికా తనసైనిక శక్తిని ఉపయోగిస్తుందని ట్రంప్? పేర్కొన్నారు. గల్ఫ్ ప్రాంతంలో సముద్ర వాణిజ్యాన్ని కాపాడటానికి అమెరికా తక్షణ చర్యలు చేపడుతుందని ఆయన వెల్లడించారు. యుద్ధం పరిస్థితుల్లో లేదా రాజకీయ అస్థిరత ఉన్న సమయాల్లో రవాణా నౌకలకు సాధారణ బీమా సంస్థలు రక్షణ కల్పించడానికి వెనుకాడతాయి. అయితే, దీన్ని దృష్టిలో ఉంచుకుని అధ్యక్షుడు ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అమెరికా ప్రభుత్వ రంగానికి చెందిన 'యునైటెడ్ స్టేట్స్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీఎఫ్‌సీ)' ద్వారా గల్ఫ్ ప్రాంతంలో ప్రయాణించే అన్ని నౌకలకు 'పొలిటికల్ రిస్క్ ఇన్సూరెన్స్' అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదగకుండా చేయడానికే

**న్యూఢిల్లీ:** భారత్‌తో పాటు చైనాను గ్లోబల్ పవర్స్‌గా ఎదగకుండా చేయడానికే తమ దేశంతో అమెరికా ఘర్షణలకు దిగుతోందని ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయ ప్రతినిధి అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి (ఖమేనీ ప్రతినిధి) అన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో అబ్దుల్ మజీద్ ఇవాళ ఢిల్లీలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇరాన్ సుప్రీం లీడర్ కార్యాలయం నుంచి భారత్‌కు ప్రత్యేక ప్రతినిధిగా అబ్దుల్ మజీద్ ఉన్నారు.

అమెరికా అగ్రరాజ్య హోదాను నిలుపుకోవడానికి ప్రపంచ ఘర్షణలను ప్రోత్సహిస్తోందని అబ్దుల్ మజీద్ ఆరోపించారు. "సమీప భవిష్యత్తులో ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన దేశాలుగా భారత్, చైనా, రష్యా, అమెరికా ఉంటాయి. అయితే, భారత్ లేదా చైనా తనతో పాటు సమాన శక్తులుగా ఎదగడాన్ని అమెరికా జీర్ణించుకోదు. అందుకే దీన్ని అడ్డుకోవడానికి ఈ యుద్ధాలను ప్రేరేపించి అమెరికా తన ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించాలనుకుంటోంది" అని అబ్దుల్ మజీద్ చెప్పారు.




### అమెరికా ప్రారంభించిన యుద్ధమిది..

ఈ యుద్ధాన్ని ప్రారంభించింది అమెరికా, ఇజ్రాయెల్ అని, ఇరాన్ కాదని అబ్దుల్ మజీద్ తెలిపారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నుంచి తమ దేశం తనను తాను రక్షించుకుంటోందని ఇరాన్ భద్రతాధికారి అలీ లారిజానీ కూడా ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. "మాపై దాడి చేసి మా పౌరులపై బాంబులు వేస్తున్నారు. మేము కేవలం మమ్మల్ని మేము రక్షించుకుంటున్నాం" అని చెప్పారు. యుద్ధాన్ని ప్రారంభించింది అమెరికానే కాబట్టి దానిని ముగించాల్సింది కూడా ఆ దేశమేనని అబ్దుల్ మజీద్ తెలిపారు. వారు ఆపితే తాము కూడా ఆపుతామని ఆయన అన్నారు.

ఇరాన్ రెండు యుద్ధాలు ఎదుర్కొంటోందని అబ్దుల్ మజీద్ తెలిపారు. ఒకటి అమెరికా, ఇజ్రాయెల్‌తో సైనిక ఘర్షణ, మరొకటి నకిలీ వార్తల యుద్ధం అని అన్నారు. "అమెరికా, ఇజ్రాయెల్‌పై సైనిక యుద్ధాన్ని మేము ఎదుర్కోగలం. అయితే దీనికంటే పెద్ద మరో యుద్ధం జరుగుతోంది. అదే నకిలీ కథనాల యుద్ధం. ఈ యుద్ధంలో వారు నకిలీ వార్తలు సృష్టిస్తారు. ఇరాన్ ప్రజలు పాలన మార్పు కోరుకుంటున్నారని చెబుతారు" అని ఆయన అన్నారు. మొత్తానికి ఇతర దేశాల ఎదుగుదలను అడ్డుకోవడమే అమెరికా లక్ష్యమని, తద్వారా వాషింగ్టన్‌కు తన ఆధిపత్యాన్ని కొనసాగించే అవకాశం ఉంటుందని చెప్పారు.

# పశ్చిమాసియా యుద్ధంలోకి పాకిస్థాన్!

**ఇస్లామాబాద్:** పశ్చిమాసియా యుద్ధంలోకి తాము కూడా దిగే పరిస్థితి రావచ్చని పాకిస్థాన్ సంకేతాలు ఇచ్చింది. సౌదీ అరేబియాతో తమకు ఉన్న ద్వైపాక్షిక రక్షణ ఒప్పందాన్ని కారణంగా చూపింది. ఈ ఒప్పందం నాటోను పోలి ఉంటుంది. ప్రతీకార దాడుల్లో ఇరాన్‌ను లక్ష్యంగా పెట్టుకున్న గల్ఫ్ దేశాల్లో సౌదీ అరేబియా ఒకటి. సౌదీ అరేబియాపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించవద్దని ఇరాన్‌ను హెచ్చరించినట్టు పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ చెప్పారు. సౌదీ అరేబియాతో తమకు రక్షణ ఒప్పందాన్ని ఉన్నట్టు ఇరాన్‌కు అర్థమయ్యేలా చేశానని దార్ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు ప్రారంభించిన తర్వాత మొదలైన ఇరాన్ యుద్ధానికి కూడా ఈ రక్షణ ఒప్పందం వర్తిస్తుందని స్పష్టంగా తెలిపారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య మొదలైన ఘర్షణ ఇతర దేశాలనూ తాకిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలు, రాయబార కార్యాలయాలు, ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ దాడులు చేసింది. మంగళవారం రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సీఐఏ ప్రధాన కార్యాలయం (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ప్రధాన కేంద్రం)పై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. ఒక రోజు ముందు సౌదీ అరేబియాలోని అతిపెద్ద రిఫైనరీలలో ఒకటైన రాస్ తనూరా చమురు శుద్ధి కేంద్రంపై దాడి జరిగింది. దాంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి.



### ఇరాన్‌తో పాక్ చర్చలు

పాకిస్థాన్-సౌదీ అరేబియా మధ్య ఉన్న రక్షణ ఒప్పందం రియాద్‌పై ప్రభావం చూపిందని, భారీ దాడులు జరగకుండా చేసిందని దార్ చెప్పారు. ఇతర దేశాల కంటే సౌదీ అరేబియాపై దాడులు తక్కువగా జరిగాయని ఆయన తెలిపారు. దీనికి ప్రతిగా సౌదీ భూభాగాన్ని ఇరాన్‌పై దాడులకు వినియోగించరాదని హామీ ఇవ్వాలని టెహ్రాన్ కోరిందని దార్ తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో సౌదీ-పాక్ మధ్య కుదిరిన నాటో తరహా రక్షణ ఒప్పందం ప్రకారం.. ఒక దేశంపై దాడి జరిగితే అది ఇరు దేశాలపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. బుధవారం సౌదీ అరేబియా స్పందిస్తూ.. ఇరాన్ చేసిన దాడులపై ప్రతిస్పందించే హక్కు తమకు ఉందని స్పష్టం చేసింది. యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ అధ్యక్షతన అర్ధరాత్రి జరిగిన మంత్రివర్గ సమావేశం తర్వాత ఈ ప్రకటన వెలువడింది.

### పాకిస్థాన్‌కు ప్రమాదకరం

ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధ విమానాలను మోహరించడం పాకిస్థాన్‌కు ప్రమాదకరం. ఇరాన్‌కు మద్దతు ఇచ్చే 4 కోట్ల షియా జనాభా పాకిస్థాన్‌లో ఉంది. గత వారం అమెరికా--ఇజ్రాయెల్ దాడుల్లో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించిన తర్వాత పాక్‌లో హింసాత్మక నిరసనలు జరిగాయి. ఈ హింసలో దాదాపు 35 మంది మరణించారు. అంతేగాక, అఫ్గానిస్థాన్‌లోని తాలిబాన్‌లతో సరిహద్దు ఘర్షణలో పాకిస్థాన్ నిమగ్నమై ఉంది. ఇలాంటి పరిస్థితిలో ఇరాన్‌తో పెట్టుకుంటే పాకిస్థాన్ సమస్యలు మరింత పెరుగుతాయి.

## ఈ ఎన్నికల్లో విజిల్ మారుమోగుతుంది



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు తనకు, తనను ప్రేమించే వారికి భావోద్వేగమని ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ అన్నారు. ఈసారి జరగబోయే ఎన్నికలు మిగతా పార్టీ వారికి సాధారణమే అన్నారు. తమకు మాత్రం ఒక భావోద్వేగమని వ్యాఖ్యానించారు. తంజావూరు జిల్లాలో జరిగిన బహిరంగ ర్యాలీలో పార్టీ మేనిఫెస్టోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో ఢిల్లీ టీమ్ బీజేపీతో పాటు అన్ని జట్లను టీవీకే ఓడిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఐపీఎల్ క్రికెట్‌లో తమిళనాడు చెన్నై సూపర్ కింగ్స్‌కు విజిల్ వేస్తే ఈ ఎన్నికల్లో టీవీకే విజిల్ గుర్తు మారుమోగుతుందని అన్నారు. ప్రజలకు తనతో ఉన్న అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరని అన్నారు. ఈ సందర్భంగా తాను అధికారంలోకి వస్తే ఏమేం చేస్తానో హామీలు ఇచ్చారు. రెండెకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతు బిడ్డల ఉన్నత విద్యకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. అయితే ఆ కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదనే నిబంధనను కూడా ఆయన స్పష్టం చేశారు. ఉన్నత విద్య కోసం భారీగా ఖర్చు చేయలేని పేద కుటుంబాలకు సహకరించాలనేది తన ఉద్దేశమని చెప్పారు. మత్స్యకారుల కుటుంబాలకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మరో నాలుగైదు వారాలు ఈ యుద్ధం కొనసాగవచ్చు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎమర్జెన్సీ మీటింగ్‌కు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇరాన్‌తో ఐదు రోజులుగా అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం చేస్తోన్న విషయం తెలిసిందే. మరో నాలుగైదు వారాలు ఈ యుద్ధం కొనసాగవచ్చని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో అమెరికా వద్ద ఉన్న క్షిపణి, ఆయుధ నిల్వలు తగ్గుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ అత్యవసర సమావేశానికి సిద్ధమయ్యారని తెలుస్తోంది. రక్షణ రంగ కాంట్రాక్టర్లు, ఇతర ఉన్నతాధికారులను ట్రంప్ శ్వేతసౌధానికి ఆహ్వానించినట్లు అంతర్జాతీయ మీడియా చెబుతోంది. ఆయుధ ఉత్పత్తిని త్వరితగతిన పెంచే అంశంపై వారితో ఆయన చర్చించే అవకాశాలున్నాయి. రెండు రోజుల్లో ట్రంప్ వారితో భేటీ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికా అమ్ములపొదిలో భారీగా క్షిపణులు తగ్గిపోయినట్లు పెంటగాన్ నివేదిక లీక్ అయింది. ఆయుధ కర్మాగారాన్ని తిరిగి నింపడానికి రక్షణ శాఖ పెంటగాన్ చర్యలు తీసుకుంటున్నట్లు కథనాలు వచ్చాయి. ఇందుకు భారీ మొత్తంలో ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేశాయి. గత మూడు నాలుగేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం సాగుతోంది. ఉక్రెయిన్‌కు నాలుగేళ్లుగా అమెరికా ఆయుధాలు అందిస్తోంది. అమెరికా వద్ద ఆయుధాలు తగ్గిపోవడానికి ఇది కూడా కారణం.


## 'రాజ్యసభ' బరిలో హేమాహేమీలు..





న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థుల జాబితాను ఖరారు చేస్తోంది. మహారాష్ట్ర నుంచి ఖాళీ అవుతున్న ఏడు స్థానాలకు గాను నలుగురు కీలక నేతలను బరిలోకి దించుతున్నట్లు బుధవారం పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ఈ జాబితాలో కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, ప్రముఖ నేతలు మాయా చింతామన్ ఇవ్నతే, రాంరావు వాడ్కుటేలకు చోటు దక్కింది. మార్చి 16న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ తన పట్టును నిరూపించుకునే దిశగా అడుగులు వేస్తోంది. మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు సంబంధించి కూడా బీజేపీ తొమ్మిది మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. బీహార్ నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో పాటు శివేష్ కుమార్‌లను బరిలోకి దించారు. నితిన్ నబిన్ నియామకం పార్టీలో సరికొత్త చర్చకు దారితీసింది. గత జనవరిలో జె.పి. నడ్డా స్థానంలో బాధ్యతలు చేపట్టిన 45 ఏళ్ల నబిన్, బీజేపీలో మూడవ తరం నాయకత్వ ఎదుగుదలకు నిదర్శనంగా నిలిచారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వానీ వంటి దిగ్గజాల మార్గదర్శకత్వంలో ఎదిగి, నేడు ప్రధాని మోదీ, అమిత్ షా నాయకత్వంలో కీలక బాధ్యతలు చేపట్టిన నబిన్, ప్రస్తుతం బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హర్యానాలో రాజ్యసభ అభ్యర్థిగా కర్నాల్ మాజీ ఎంపీ సంజయ్ భాటియాను పార్టీ ఎంపిక చేసింది. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు అత్యంత సన్నిహితునిగా పేరున్న భాటియా, తనలాంటి సాధారణ కార్యకర్తకు ఈ అవకాశం కల్పించినందుకు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 90 మంది సభ్యులున్న హర్యానా అసెంబ్లీలో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఉండటంతో భాటియా ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఇక అస్సాం నుంచి తెరష్ గోవాలా, జోగెన్ మోహన్; ఛత్తీస్‌గఢ్ నుంచి లక్ష్మీ వర్మ, ఒడిశా నుంచి ఆ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, సుజిత్ కుమార్‌లను బీజేపీ అధిష్టానం నామినేట్ చేసింది.

## రాజ్యసభకు నితీశ్ కుమార్?



నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారా? అనే చర్చ జాతీయ మీడియాలో జోరుగా సాగుతోంది. ఆయన రాజ్యసభకు వెళ్లనున్నారని, ఆ తర్వాత ఆయన తన పదవికి రాజీనామా చేస్తారనే ఊహాగానాలు బీహార్ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. నితీశ్ కుమార్ రేపు పార్లమెంటు ఎగువ సభకు నామినేషన్ దాఖలు చేయనున్నారని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ ఝా బుధవారం ఢిల్లీ నుంచి పాట్నాకు వచ్చి నితీశ్ కుమార్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కూడా ఢిల్లీ నుంచి పాట్నాకు వచ్చినట్లు తెలుస్తోంది. బీహార్‌లో జరుగుతున్న పరిణామాలు నితీశ్ కుమార్ రాజ్యసభకు వెళతారని, ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తారనే ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయి. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తే ఆయన తర్వాత ఎవరు అనే చర్చ సాగుతోంది. ఆయన కుమారుడు నిశాంత్ రాజకీయాల్లోకి రానున్నారని, త్వరలో జేడీయూ ఈ అంశంపై ప్రకటన చేస్తుందని బీహార్ మంత్రి శ్రవణ్ కుమార్ ఇప్పటికే వెల్లడించారు. తన కుమారుడు రాజకీయల్లోకి రావడానికి నితీశ్ కుమార్ కూడా అంగీకరించారని అంటున్నారు. నిశాంత్‌కు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. బీహార్‌లో ఎన్డీయేకు 202 సీట్ల బలం ఉండగా, ఒక రాజ్యసభ సీటు గెలవడానికి 41 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఎన్డీయే కూటమి 4 నుంచి ఐదు సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది.

# ఆర్థిక పరిస్థితి... ఏంటీ?

-మొదటిపేజీ తరువాయి

ఖజానా "ఫుల్"గా కనిపిస్తుంది. హామీల జాబితా చూస్తే అది మినీ బడ్జెట్ కాదు, మేగా బడ్జెట్ అన్నట్టు ఉంటుంది. కానీ అధికారంలోకి వచ్చాక అదే ఖజానా ఒక్కసారిగా "ఖాళీ మట్టి కుండ"గా మారిపోతుంది. ఇది ఆర్థిక శాస్త్రంలోని కొత్త సిద్ధాంతమా? లేక రాజకీయ శాస్త్రంలోని పాత మంత్రామా?ఎన్నికల ముందు "ఆరు గ్యారెంటీలు ? 420 హామీలు" అంటూ ప్రజలకు కలల కట్టడాలు చూపిస్తారు. ఓట్లు పడిన తర్వాత మాత్రం "ఖజానాలో లంకెబిందెలు లేవు" అని చెబుతారు. అయితే ఇదే సమయంలో మరో సభలో "అవసరమైతే వెయ్యి కోట్లు ఇస్తాం" అనే ధైర్యవాక్యాలు వినిపిస్తే? ప్రజలు ఏది నమ్మాలి? ఖజానా ఖాళీనా? లేక డైలాగ్‌లే ఫుల్‌గా ఉన్నాయా?ఇది చూసి ప్రజలకు ఒక సందేహం రావడం సహజం.. ఖజానా 'నిల్' అయితే మాటల ఖజానా మాత్రం 'అన్‌లిమిటెడ్' ఎలా? రాజకీయాల్లో ఇది కొత్త గణితం కావచ్చు. 0 + 1000 = సభలో చప్పట్లు అన్న ఫార్ములా!ఇంకో ఆసక్తికర విషయం ఏమిటంటే? కేంద్రం నుంచి వచ్చిన నిధులు, రాష్ట్ర అప్పులు, బడ్జెట్ లెక్కలు.. ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలంటే శ్వేతపత్రం అవసరం అంటున్నారు. కానీ రాజకీయాల్లో శ్వేతపత్రం అంటే వాస్తవాల పుస్తకం కాదు, వాదాల పుస్తకంగా మారిపోతుంది. ఒక పార్టీ విడుదల చేస్తే అది "నిజాల గ్రంథం"; మరో పార్టీకి అది "అబద్ధాల సంకలనం".ఇక అప్పుల కథ కూడా సినిమాలా ఉంది. ఎవరు అధికారంలో ఉన్నా అప్పులు మాత్రం హీరోల్లా సీన్‌లో ఉంటాయి. "మేము తీసుకున్న అప్పులు అభివృద్ధి కోసం" అంటారు. "వాళ్లు తీసుకున్న అప్పులు దుర్వినియోగం" అంటారు. చివరకు ప్రజలకు మాత్రం ఈఎంఐలే మిగులుతాయి.. పన్నుల రూపంలో.మొత్తానికి "రాష్ట్ర ఖజానా నిల్" అన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట కంటే "రాజకీయ నాటకం ఫుల్" అన్న మాట దగ్గరగా ఉందేమో అనిపిస్తోంది. ప్రజలు ఇప్పుడు ఒకే ప్రశ్న అడుగుతున్నారు. ఖజానా నిజంగానే ఖాళీనా? రేవంత్ రెడ్డి గారు? లేక రాజకీయ సంభాషణలే ఖాళీగా ఉన్నాయా?సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఓ శ్వేతపత్రం వస్తే బాగానే ఉంటుంది. ఎంతసేపు కేసీఆర్ ఖజానా ఖాళీ చేశాడనే బదులు.. మీరు అధికారంలోకి వచ్చాక ఏం చేశారన్నదే జనాలు చూస్తారు. అందుకే కేసీఆర్ ను కాదని మీకు ఓటు వేశారు. ఎందుకంటే సంఖ్యలు మాట్లాడితే వాదాలు తగ్గుతాయి. లెక్కలు బయటపెడితే నిజం బయటపడుతుంది. అప్పటివరకు మాత్రం సభల స్టేజీలపై ఖజానా 'నిల్' చప్పట్లు 'ఫుల్' అనే ట్రెండ్ కొనసాగుతుందేమో!

# హైదరాబాద్‌లో ఖమేనీ రోడ్



**హైదరాబాద్ :** ఇప్పుడు ఎక్కడ చూసినా, ఎక్కడ విన్నా యుద్ధం గురించే చర్చ. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతమవుతు న్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఒక పేరు మాత్రం పెను సంచలనం సృష్టిస్తోంది. అదే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేరు. ఇటీవలి దాడుల్లో ఖమేనీ మృతి చెందడంతో యుద్ధం మరింత తారాస్థాయికి చేరుకుంది. ఇక్కడ మరింత ఆశ్చర్యపోయే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఖమేనీ పేరు మీద హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా ఓ రోడ్డే ఉందట. ఏంటి.. వినడానికి చాలా వింతగా ఉంది కదూ..!ఇరాన్ దాడుల నేపథ్యంలో అల్లకల్లోలమైన ప్రపంచ దేశాలను ఇప్పుడీ విషయం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భాగ్యనగరంలో 'ఖమేనీ' రోడ్డు ఉందన్న విషయం తాజా దాడుల నేపథ్యంలో కొత్తగా బయటికి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ మరణ వార్త ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా.. మరోవైపు, హైదరాబాద్ నగరంలో ఖమేనీ పేరుతో ఒక రోడ్డు ఉందన్న విషయం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. అది కూడా నగరంలోనే ప్రముఖంగా వినిపించే బంజారాహిల్స్‌లో ఈ పేరుతో రోడ్డు ఉండటం విశేషం. ఇక్కడే మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ పేరు మీద నగరంలో రోడ్డు ఉందన్న విషయం వైరల్ అవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం మరణించిన నేత పేరుతో కాకుండా ఇరాన్ తొలి సుప్రీం లీడర్ జ్ఞాపకార్థమే ఈ రోడ్డుకు ఈ పేరు పెట్టారని అసలు విషయం బయటపడింది. ఈ విషయం మాకు ఇప్పటివరకూ తెలియదని, ఖమేనీ మరణం తర్వాతే ఇలాంటి ఆశ్చర్యం కలిగించే కొత్త విషయాలు బయటికి వస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు.హైదరాబాద్ నగరంలో ఈ రోడ్డు ఎక్కడ ఉందనే కదా ఇప్పుడు మీ అనుమానం..! జీవీకే వన్ మాల్ ఎదురుగా ఉండే బంజారాహిల్స్ రోడ్డు నెం.7ని అధికారికంగా 'ఇమామ్ ఖమేనీ రోడ్' అని పిలుస్తారు. ఇదే ప్రాంతంలో ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం ఉండటంతో అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఈ రోడ్డుకు ఈ పేరును పెట్టినట్లు సమాచారం. కుతుబ్ షాహీల కాలం నుంచి హైదరాబాద్, ఇరాన్ దేశాల మధ్య ఉన్న ధృడమైన సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలకు గుర్తుగా అప్పటి అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడమే కాకుండా అప్పటి ప్రభుత్వం ఈ పేరును అధికారికంగా రికార్డుల్లో కూడా చేర్చింది.ఇరాన్ మొదటి సుప్రీం లీడర్ రుహ్హొల్లా ఖమేనీ పూర్వీకులకు మన దేశంతో విడదీయలేని సంబంధాలు ఉండేవి. ఖమేనీ తాతలు ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాకు చెందిన కింతూరులో పుట్టారని చరిత్రకారులు చెబుతున్న మాట. 19వ శతాబ్దంలోనే ఖమేనీ పూర్వీకులు ఇరాన్‌కు వలస వెళ్లి అక్కడే రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడంతో ఈ సంబంధం ఇలా కొనసాగింది. అయితే.. తాజా దాడుల ఘటనలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందాడు. డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కాంపౌండ్ లక్ష్యంగా ఫిబ్రవరి 28న ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు.

ఖమేనీ ఇరాన్ మరింత అట్టుడికిపోయింది. తమ దేశంపై దాడి చేసిన ఇజ్రాయెల్, అమెరికాలను వదిలే ప్రసక్తే లేదని ప్రకటన కూడా విడుదల చేసింది. ఈ క్రమంలో శత్రుదేశాల మధ్య పోరు మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇదంతా ఇలా ఉండగా.. ఖమేనీ మరణం తర్వాత హైదరాబాద్ నగరంలో ఓ రోడ్డు ఉందనే విషయాన్ని ఓ నెటిజన్ తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా వెల్లడించడంతో ఇక టి నుంచి సోషల్ మీడియాలో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది.

# గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణ వాసులు



**హైదరాబాద్ :** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు.. వీటికి ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో మిడిల్ ఈస్ట్‌లో తీవ్ర యుద్ధ వాతావరణం నెలకొంది. సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన తర్వాత ఇజ్రాయెల్, అమెరికా బెదిరింపులకు ఇరాన్ ఏమాత్రం లొంగడం లేదు. దీంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గల్ఫ్ దేశాల్లో ఉన్న తమ వారు ఎలా ఉన్నారోనని రాష్ట్రంలోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. తెలంగాణ నుంచి లక్షలాది మంది జనం ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి పనిచేస్తున్నారు. ఇక్కడ చేయడానికి పనుల్లేక, చేసిన పనులకు సరైన డబ్బులు రాకపోవడంతో.. విదేశాలకు వెళ్లి కష్టపడితే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో చాలా మంది వెళ్తున్నారు. అక్కడికి వెళ్లిన వారు బాగా సంపాదిస్తుండటంతో ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, తెలిసిన వాళ్లు కూడా ఆయా దేశాలకు వెళ్లి డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరాన్, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఒమన్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో భారీ సంఖ్యలో భారత్ నుంచి వెళ్లిన వాళ్లు ఉన్నారు. అందులో ఒక్క తెలంగాణ నుంచే దాదాపు 15 లక్షల మంది ప్రజలు ఈ గల్ఫ్ దేశాల్లో రకరకాల పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో అక్కడ ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారింది.అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై యుద్ధం ప్రకటించగా.. ఈ దాడులు మొత్తం గల్ఫ్ దేశాలకు అంటున్నాయి. దీంతో ఆయా దేశాల్లో ఉన్న తెలుగువారి భద్రతపై తెలుగు రాష్ట్రాల్లోని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇక తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణవాసులు ఉండగా.. అందులో 9 లక్షల మంది ఉత్తర తెలంగాణకు చెందినవారే ఉండడం గమనార్హం. ఇక సౌదీ అరేబియా, దుబాయ్, షార్జా, అబుదాబీ, ఒమన్, ఖతార్, బహ్రెయిన్, కువైట్ దేశాల్లో మొత్తంగా 90 లక్షల మంది భారతీయులు ఉండగా.. అందులో 15 లక్షల మంది తెలంగాణ, మరో 15 లక్షల మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.ఇక ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 2.5 లక్షల మంది.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మరో 2 లక్షల మంది.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 1.5 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి జీవిస్తున్నారు. ఇక సిద్దిపేట జిల్లాకు చెందిన 15 వేల మంది పలు రకాల పనులు చేస్తున్నారు. ఒక్క ఇజ్రాయెల్‌లోనే నిజామాబాద్ జిల్లా నుంచి 700 మంది పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వారు యూఏఈ, ఒమన్ వంటి దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు.ఇజ్రాయెల్, అమెరికా దేశాలపై కోపంతో.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ సైన్యం క్షిపణి, డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. దీంతో ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లోని చాలా కంపెనీల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే గత రెండు రోజులుగా వలస కార్మికులు మొత్తం బంకర్లలోనే తలదాచుకుంటున్నారు. నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం వరకు బాంబుల శబ్దాలు దద్దరిల్లిపోతున్నాయని.. బంకర్లలో దాక్కొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నట్లు అక్కడి ఉన్నవారు తమ కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. వారు అక్కడ క్షేమంగానే ఉన్నట్లు చెప్పినా.. ఇక్కడ ఉన్న వారు మాత్రం భయం గుప్పిట్లోనే జీవిస్తున్నారు.మరోవైపు.. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇక మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు వలస కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రభుత్వం తరఫున చేయాల్సిన సాయాన్ని చేస్తామని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో ఉన్నవారిని రక్షించేందుకు అన్ని చర్యలు చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా వెల్లడించారు.మరోవైపు.. గల్ఫ్ కార్మికుల సమాచారం తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. అబుదాబీ (యూఏఈ) టోల్‌ఫ్రీ నంబర్ 800-46342.. వాట్సాప్ +971543 090571.. కువైట్ +96565 501946.. బహ్రెయిన్ 00973-39418071.. మస్కట్ (ఒమన్) 800 71 234.. జోర్డాన్ 00962 770422 276.. బాగ్దాద్ (ఇరాక్) +964 771 651 1185.. టెహ్రాన్ (ఇరాన్) +9891 281 09115.. సౌదీ అరేబియా 00 966 114 884 697.. దోహా (ఖతార్) 00974 5564 7502.. పాలస్తీనా +970 592916418 నంబర్లకు సంప్రదించి తమ వారి క్షేమ సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య.. గల్ఫ్ కార్మికుల కోసం కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కార్మికులు 87126 59700, 87126 59821 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వం కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రజల భద్రత కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. విదేశాంగ శాఖతో పాటు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో తెలంగాణ భవన్ అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నారు. విదేశాల్లోని తెలంగాణవారికి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, ఎమర్జెన్సీ ఎదురైతే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తెలిపారు. 24 గంటల పాటు 9871999044, 58322143, 991014749, 9643723157 నంబర్లను అందుబాటులో ఉంచారు.

## ఆరంభంలోనే నిప్పులు

-మొదటిపేజీ తరువాయి

ఇరువైపులా రైతు పట్టాల సెగ వస్తుంది. ప్రతి ఏడాది రూ. కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ విషయంలో మాత్రం నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తుండటంతో పరిసరాల్లో పచ్చదనం తగ్గిపోతుంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి :**

గొడుగు, టోపీ, తెల్లని రుమాలు ధరించండి. ఎండ తీవ్రత ఎక్కువ ఉంటే బయట వెళ్లకండి. తెల్లని నూలు వస్త్రాలు ధరించడం మంచిది. నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలి. కూల్? డ్రింక్స్?, మత్తు పానీయాల జోలికి వెళ్లకూడదు. వడదెబ్బ సోకిన వారికి 15 నిమిషాలకు ఒకసారి కోల్డ్? స్పాంజింగ్? చేయాలి. చికిత్స చేయించాలి.ల "ఎండకాలంలో అలసత్వం ప్రదర్శించడం తగదు. వడదెబ్బ బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ కూలీలతో పాటు వృద్ధులు, పిల్లలు, వాహనదారులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. మీకు వడదెబ్బ లక్షణం కనిపిస్తే సమీప సర్కారు ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలి." – సాధ్విజ, వైద్యాధికారిణి, డోర్నకల్?

**ఉమ్మడి వరంగల్ జిల్లా వారీగా ఉష్ణోగ్రతలు**

| తేదీలు | ఉష్ణోగ్రతలు |
| --- | --- |
| ఫిబ్రవరి 26 | 33.5 |
| ఫిబ్రవరి 27 | 34.0 |
| ఫిబ్రవరి 28 | 34.2 |
| మార్చి 1 | 34.0 |
| మార్చి 2 | 34.5 |
| మార్చి 3 | 36.0 |

విద్యార్థులు నీరు ఎక్కువగా తాగండి : ప్రస్తుతం విద్యార్థులు ఇంటర్? పరీక్షలు రాస్తున్నారు. మార్చి 14 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో చదువు ఒత్తిడిలో పడి నీరు తాగడం మర్చిపోవద్దు. పుస్తకాల పక్కన నీళ్ల బాటిల్? కూడా ఉంచుకోండి. పళ్ల రసాలు, గ్లూకోజ్?, బార్లీ వంటివి తీసుకోవాలి. కాటన్? లేదా తేలికపాటి రంగు దుస్తులు ధరించాలి. వేసవిలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. ఎండలో ఎక్కువగా ఉండేవారు తరచూ నీటిని తీసుకోవాలి. నిమ్మరసం, మజ్జిగ, టెంకాయ నీళ్లు తీసుకోవాలి. శరీరానికి తగిన నీరు లేకపోతే పెదాలు, నాలుక ఎండుతాయి. ఇలా అవుతే హెచ్చరికగా భావించాలి.

**వేసవిలో వ్యాధుల ముప్పు**

ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరం పొడిబారడం, చెమటలు పట్టకపోవడం, ఎర్రగా మారడం, దురదలు, తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే ఫస్ట్? ఎయిడ్? తీసుకొని వైద్యులను సంప్రదించాలి. మరి కొందరికి బీపీ, షుగర్? పెరగడంతో పాటు, గుండె జబ్బులు, పక్షవాతం, కడుపునొప్పి, మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యలు, చర్మ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

## ఇది మనిషి సృష్టించిన విషాదం..



-మొదటిపేజీ తరువాయి

కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి.

ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

## మహిళలకు బీమా పథకం

-మొదటిపేజీ తరువాయి



పడుతుంది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు లోన్ తిరిగి చెల్లించడం కష్టంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో డ్వాక్రా సంఘంలో ఇతర సభ్యులపై కూడా భారం పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డ్వాక్రా మహిళలకు ఊరట కలిగించే పథకాన్ని త్వరలో తీసుకురానుంది.

**బీమా పథకం**

డ్వాక్రా మహిళల రుణానికి ప్రభుత్వం బీమా స్కీమ్‌ను అమలు చేయనుంది. త్వరలోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టనుంది. ఈ పథకం ద్వారా రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తూ మరణిస్తే.. ప్రభుత్వమే మహిళ చెల్లించాల్సిన రుణాన్ని బ్యాంకుకు అందించనుంది. దీని వల్ల కుటుంబసభ్యులపై భారం తగ్గుతుంది. ఇందుకోసం ప్రతీ డ్వాక్రా మహిళకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించనుంది. ఈ బీమా సొమ్మును ప్రభుత్వమే బ్యాంకుకు చెల్లిస్తుంది. ఇది రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలందరికీ ప్రయోజనం చేకూర్చనుంది. ఇప్పటివరకు కుటుంబసభ్యులు చెల్లించాల్సి వచ్చేది. కుటుంబసభ్యులు చెల్లించని సమయంలో డ్వాక్రా సంఘంలోని ఇతర సభ్యులపై దీని ప్రభావం పడేది. రుణాలు చెల్లించని డ్వాక్రా సంఘాలను బ్యాంకులు బ్లాక్ లిస్టులో చేర్చుతున్నారు. దీని వల్ల కొత్త రుణాలు పొందేందుకు కష్టమవుతుంది.

**సీతక్క కీలక ప్రకటన**

త్వరలోని డ్వాక్రా మహిళలకు రుణ బీమా విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. అలాగే మహిళలకు జీవిత బీమా కూడా కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఇక డ్వాక్రా మహిళలు అకాల మరణం పొందితే కుటుంబసభ్యులు రుణం చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తుందన్నారు. త్వరలోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఇక డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణిస్తే కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. 2024లో ఈ పథకం ప్రారంభమవ్వగా.. ఇప్పటివరకు 231 క్లెయిమ్స్‌ను పరిష్కరించినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఉపయోగపడేలా అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలోనే మరిన్ని కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. మహిళలకు తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.

## సంపాదకీయం

# 400 కోట్ల బంగారం ఎక్కడ


పోలీసుల ఎదుట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టు పార్టీ కుదెలైపోయింది. ఇప్పటికే వందలాది మంది మావోలు మృత్యువాత పడగా, పలువురు అగ్రనేతలు పోలీసులు ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి, మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, నరసింహారెడ్డి వంటి అగ్రనేతలంతా లొంగిపోవడంతో ఇక ఆ పార్టీ దేశంలో కనుమరుగవ్వడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వారు పార్టీ కోసం సేకరించిన డబ్బు, నగలు ఎక్కడున్నాయనే విషయంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.కేవలం డబ్బు, బంగారమే కాకుండా మావోయిస్టులకు సంబంధించిన పలు విలువైన డ్యాక్యుమెంట్లు, ఆధునిక ఆయుధాలు అడవుల్లో రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచినట్లు ప్రచారం సాగుతోంది. వాటి వివరాలను సేకరించడం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలు మావోయిస్టు పార్టీ అగ్రనేతలను తీవ్రంగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల్లో అగ్రనేతలుగా ఉన్నవారంతా ప్రస్తుతం పోలీసుల సమక్షంలో ఉన్నారు. దీంతో పార్టీ నిధులు, నిల్వల గురించి వారికి తెలిసి ఉంటుందన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం కేంద్ర నిఘా సంస్థలు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నాయి. కేంద్ర నిఘా వర్గాలకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా), ఆర్మీ ఇంటెలిజెన్స్‌తో పాటు కేంద్ర సాయుధ బలగాలకు చెందిన సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర బృందాలు ఇప్పటికే వారిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నాయి. గడచిన ఆరు నెలల కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ఒక్కరొక్కరుగా లొంగిపోతున్న విషయం తెలిసిందే. వారు లొంగిపోతున్న సమయంలో కొంతమది నేతలు తమ వద్ద ఉన్న ఆయుధాలు, నగదు, డబ్బు పార్టీ అధిష్టానానికి అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. మరికొంతమంది ఆయుధాలతో లొంగిపోయినప్పటికీ పార్టీకి చెందిన నిధులు, బంగారం మాత్రం అడవుల్లో ఉన్న క్యాడర్ కు అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాము ఆయుధాలతో విప్లవం రాదు అని నమ్మాం కనుక తమ వద్ద ఉన్న ఆయుధాలతో లొంగిపోయామని, అయితే ఇంకా పార్టీలో ఉన్న క్యాడర్ అడవుల్లో ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉండటంతో తన వద్ద ఉన్న ఆరుకోట్ల రూపాయల నగదు, ఆరు కిల్లో బంగారం పార్టీ నేతలకు అప్పగించి వచ్చినట్లు స్పష్టం చేశారు. దాన్ని భూతల్లి కడుపులోనే దాస్తామని కూడా ఆయన వెల్లడించారు. మావోయిస్టు పార్టీ వద్ద పెద్ద ఎత్తున ఆయుధాలతోపాటు వందల కోట్ల రూపాయలు, అంతకు మించి విలువైన బంగారం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు, పీఎల్‌జీఏ కమాండర్ అయిన బార్సేదేవాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో తెలంగాణ చరిత్రలోనే మొదటి సారిగా మావోయిస్టు డంప్ నుంచి రూ.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. అలాగే 48 అత్యంత అధునాతన ఆయుధాలు పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. మావోయిస్టులు కొవిడ్ సమయంలో తమ వద్ద ఉన్న కోట్లాది రూపాయల నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. ఝార్ఖండ్, ఛత్తీ?సగఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీ తదితర రాష్ట్రాల్లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావోయిస్టులు పార్టీ ఫండ్ సేకరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరించడానకి విస్తృత నెట్‌వర్క్ ఉందని జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) ధృవీకరించింది. ఈ క్రమంలోనే సుమారు రూ.400 కోట్ల విలువైన నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. అయితే అది ఎవరివద్ద ఉందనేది ప్రస్తుతం సస్పెన్స్..ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం) సభ్యులు ఇద్దరు మావోయిస్టుకు పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మజ్దూర్ సంఘటన సమితి (ఎంఎస్ఎస్) సభ్యులు కొందరు నిధులు సేకరించి, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గతంలో మావోయిస్టు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడైన ప్రద్యుమ్నశర్మ బంధువు ఒకరు చెన్నైలోని వైద్య కళాశాలలో చేరగా, ఆమె ఫీజుకు కావాల్సిన కోటి 13 లక్షలను బ్యాంకు ఖాతాల ద్వారా ఇచ్చినట్లు ఎన్ఐఏ గుర్తించడం సంచలనంగా మారింది. పార్టీ సానుభూతి పరుల వద్దే ఇంత సొమ్ము ఉంటే ఇంకా పార్టీ డంపులలో ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. మావోయిస్టు పార్టీ నోట్ల మార్పిడి సమయంలో తీవ్రంగా నష్టపోయినట్లు పార్టీ అగ్రనేతలు చెబుతున్నారు. సుమారు రూ.200 కోట్ల వరకు పాత నోట్లను మార్పిడి చేసేందుకు పార్టీ అగ్రనాయకత్వం ప్రయత్నించినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో కొంతమొత్తాన్ని మార్చినప్పటికీ మిగతది సాధ్యం కాలేదని చెబుతున్నారు. నోట్ల మార్పిడి కోసం పార్టీ సానుభూతిపరులు, ఇతర వర్గాల వారికి పార్టీ నగదును అప్పగించగా వారు డబ్బును మార్చినప్పటికీ తిరిగి పార్టీకి ఇవ్వలేదన్న ప్రచారం ఉంది. దీన్ని అగ్రనేత ఒకరు ధృవీకరించారు కూడా. అలా పెద్దమొత్తంలో పార్టీ ఆర్థికంగా నష్టపోయినట్లు నేతలు చెబుతున్నారు.మావోయిస్టు పార్టీ వద్ద సుమారు400 కిలోల బంగారం ఉండి ఉంటుందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. అయితే దాన్ని ఎక్కడ దాచారనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. బంగారాన్ని అంతా అడవుల్లోని డంపు ల్లో దాచి ఉండటారని కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు రూ.500 కోట్ల బంగారం మావోయిస్టు పార్టీ వద్ద ఉందనే అనుమానంతో ఆయా సంస్థలు మావోయిస్టులను ప్రశ్నిస్తున్నాయి. అయితే పార్టీ అగ్రనేతలు పార్టీ నిలువుల గురించి నోరు తెరుస్తారా? లేదా అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

# యుద్ధం అక్కడ నష్టం ప్రపంచమంతటా!



ఐరాస ప్రక్షకపాత్రను వహిస్తోంది. ఇరాన్‌పై రెండు దేశాల ముప్పేట దాడి విషయంలో అమెరికన్ ట్రంప్– ఇజ్రాయిల్ నేతన్యాహూ ద్వయాన్ని ఒప్పించగల మధ్యవర్తిత్వం చేసే దేశాలు కరువైనాయి. నిరాయుధీకరణ నిత్య మంత్రం కావాలని ఐరాస బోధించడం మినహా చేసేది ఏమీ కనిపించడం లేదు. ఆయుధాలు, యుద్ధ వ్యాప్తి నిరోధక చర్యలు సాకారం కావాలని ఆకాంక్షిస్తున్న ఐరాస నేటి ఇజ్రాయిల్–అమెరికా సైనిక దాడులను ఆపమని ఒక్క మాట కూడా ఎనలేని నిస్సహాయ దుస్థితిలో ఉన్నది. ప్రపంచ శాంతి నెలకొనాలనే సదుద్దేశంతో 2022 నుంచి ఐరాస ప్రతి ఏట "అంతర్జాతీయ నిరాయుధీకరణ, వ్యాప్తి నిరోధక అవగాహన దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ డిస్‌ఆర్మమెంట్ అండ్ నాన్–ప్రొలిఫరేషన్ అవేర్‌నెస్)" పాటించడం జరుగుతుంది. అణ్వాయుధాలు, రసాయన, జీవాయుధాల వల్ల కలిగే అపార నష్టాలను అవగాహన పరుస్తూ నిరాయుధీకరణ సూత్రాలను వ్యాప్తి చేస్తున్నది. సామూహిక వినాశన ఆయుధాల వ్యాప్తిని కట్టడి చేయడం ద్వారా అంతర్జాతీయ భద్రత, మానవాళి రక్షణ, శాంతి నెలకొంటాయని ప్రచారం నిర్వహిస్తున్నారు. 1945లో హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణు బాంబు దాడుల విధ్వంసంతో 2 లక్షల ప్రజలు మరణించగా, లక్షల మంది దీర్ఘకాలిక నష్టాలను కూడా నమోదు చేసుకున్నారు. 1945లో ప్రారంభమైన అణ్వాయుధ పరీక్షలు, దాదాపు నేటికీ 2,000 వరకు అణు పరీక్షలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 24 ఫిబ్రవరి 2022లో ప్రారంభమైన ఉక్రెయిన్– రష్యా యుద్ధం గత నాలుగేళ్లుగా కొనసాగుతోంది. అదే విధంగా 07 అక్టోబర్ 2023 నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి అంతం కనిపించడం లేదు. నేడు ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా మరో యుద్ధం కొనసాగిస్తూ మెసైల్స్ వర్షంతో మధ్య ప్రాచ్యం మంటల్లో భగ్గుమంటోంది. గల్ఫ్ దేశాల ఆకాశం బాంబు పేలుళ్లతో నల్లటి కారుమబ్బులతో నిండి ఉన్నది. నగరాలు, సైనిక స్థావరాలు, చమురు శుద్ధి కేంద్రాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా భీకర బాంబుల దాడితో ప్రపంచ శాంతి గాల్లో దీపమైంది. 3వ ప్రపంచ యుద్ధం రానుందా అనే వాదనలు బలపడుతున్నాయి. పిల్లిని గదిలో బంధించి కొడితే గత్యంతరం లేక తెగబడి ఎదురు తిరుగుతుందనే విషయం మనకు తెలుసు. నేడు ఇరాన్ పరిస్థితి కూడా అలాగే ఉన్నది. ఇరాన్ అణు కార్యక్రమం మింగుడుపడని ఇజ్రాయిల్, అమెరికాకు సంయుక్తంగా భీకర సైనిక దాడులు చేసి ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని మట్టుపెట్టడంతో పాటు ఖమేనీ సమీప బంధువులు/కుటుంబ సభ్యులు, అగ్ర నేతలు, ఉన్నత సైనిక అధికారులు, సహాయకులు కలుపుకొని ఇప్పటికీ 800లకు పైగా నిండు ప్రాణాలను కోల్పోయారు. 1989 నుంచి నిన్నటి వరకు ఇరాన్ సుప్రీమ్ నాయకుడిగా ముదున్నర దశాబ్దాలకు పైగా తిరుగులేని నాయకుడిగా శాసించడం చూసాం. ఇరాన్‌లో పార్లమెంట్, న్యాయవ్యవస్థ, పోలీస్ విభాగం, మీడియా, మతపరమైన వర్గాలను తన అదుపులో ఉంచుకొని ప్రత్యర్థులను అక్రమంగా అరెస్టులు చేయడం, మానవ హక్కులను హననం చేయడం, మహిళా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం, వ్యతిరేక ఉద్యమాలను అణచివేయడం తీవ్ర స్థాయిలో జరిగి పోయింది. ఇరాన్‌కు చెందిన వ్యూహాత్మక మిలటరీ, వైమానిక, నావికా కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని వేల బాంబులను ఇజ్రాయిల్–అమెరికాలు వేస్తున్నాయి. పశ్చిమాసిమాలో ఉద్రిక్తత నెలకొంది. ఈ భీకర యుద్ధంతో ప్రపంచ దేశాల్లో చమురు ధరలు బంగారం వలె ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇరాన్‌లో నిరంకుశ పాలన అంతం అయ్యిందని, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం వచ్చిందని ఇరానియన్ ప్రజలకు ట్రంప్ ఉచిత సలహా ఇస్తున్నారు. ఈ యుద్ధం ఇలాగే మరి కొన్ని వారాలు కొనసాగుతుందని నెతన్యాహు–ట్రంప్ ద్వయం ప్రకటిస్తున్నారు. రోజు రోజుకు యుద్ధం ముదురుతోంది. చమురు కేంద్రాలు భగ్గుమంటున్నాయి. "ఆపరేషన్ రైజింగ్ లయన్" పేరుతో ఇజ్రాయిల్ చేపట్టిన దాడులు ఇరాన్ అణుకేంద్రాలు, సైనిక స్థావరాలను నేలమట్టం చేసాయి. ప్రతీకార జ్వాలలతో రగులుతున్న ఇరాన్ రగిలి పోతూ అమెరికా సైనిక స్థావరాలున్న 8 దేశాలపై ఏకకాలంలో దాడులు చేసింది. నేడు ఇరాన్ చేసిన ఎదురు దాడుల్లో బెహ్రెయిన్, కువైట్, ఓమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల చమురు శుద్ధి కేంద్రాలు ప్రభావితం అయ్యాయి. నేడు ఇరాన్ పక్షాన మిలిటెంట్ గ్రూపులు కూడా రంగంలోకి దిగుతున్నాయి. అమెరికా చర్చలకు సిద్ధమని ప్రకటించినా ఇరాన్ ససేమిరా అంటోంది. 'స్ట్రేట్ ఆఫ్ హార్మోజ్' జల సంధి సముద్ర రవాణా మార్గాన్ని ఇరాన్ మూసి వేయడంతో ప్రపంచ దేశాల 20 శాతం చమురు సరఫరా ఆగి పోయింది. దీనితో ప్రపంచ దేశాల్లో, ముఖ్యంగా భారత్, చైనా, జపాన్ లాంటి దేశాలకు చమురు రవాణా ఆగి పోయింది. 9 కోట్లకు పైగా జనాభా కలిగిన ఇరాన్‌కు 6.10 లక్షల క్రియాశీలత సైన్యం ఉన్నది. 28 ఫిబ్రవరి రోజున ఇజ్రాయిల్ చేసిన సైనిక దాడుల్లో అపార ప్రాణ ఆస్తి నష్టాలు నమోదు అవుతున్నాయి. అమెరికా ప్రారంభించిన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" ఫలితంగా ఇరాన్ మంటల్లో చిక్కుకుంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా వైమానిక, సముద్ర తలాల మీదుగా ముప్పేట దాడులు కొనసాగుతున్నాయి. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తున్నామని అనుకున్న అమెరికా–ఇజ్రాయిల్ దేశాలు తీవ్ర బాంబు ఇరాన్ ప్రతీకార దాడులను ఎదుర్కొంటున్నాయి. భారతదేశ చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతుల మీదనే ఆధారపడి ఉన్నది. హార్మోజ్ జల సంధి మూసి వేయడంతో బ్యారెల్ ముడి చమురు ధరలు 80 డాలర్లకు చేరిందని, రానున్న రోజుల్లో మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. దీనితో పాటు గ్యాస్, ఖనిజాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, బంగారం, వెండి, వ్యవసాయ పరికరాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్, సబ్బులు, తలనూనె, ఎరువులు, బిస్కెట్లు, షాంపులు లాంటి అనేక నిత్యావసర సరుకుల దిగుమతులు భారమై, రవాణా దూరమై ధరలు పెరగనున్నాయి. ఈ జల సంధిని మూసివేయడంతో 13 దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు భారమై పోతున్నాయి. భారత్ రోజుకు వినియోగించే 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురులో దాదాపు 2 మిలియన్ బ్యారెళ్లు ఈ జల సంధి నుంచి మాత్రమే సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం 25 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉండగా, మరో 25 రోజులకు సరిపడా చమురు రవాణా మార్గంలో ఉన్నాయని భారత ప్రభుత్వం వెల్లడిస్తున్నది. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాలతో దగ్గరి సంబంధాలను కొనసాగిస్తున్న భారత్ నేడు ఈ దేశాలను సంయమనం పాటించాలని, చర్చల ద్వారా సమస్యల పరిష్కరించుకోవాలని ప్రకటన చేయడం మినహా మరో మార్గం కనిపించడంతో లేదు. ట్రంప్–నెతన్యాహు ద్వయానికి సత్వరమే సద్బుది కలగాలని, ఇరాన్ కూడా సంయమనం పాటించాలని కోరుతున్నది. ఏది ఏమైనా "అంతర్జాతీయ నిరాయుధీకరణ, వ్యాప్తి నిరోధక అవగాహన దినం" వేదికగా నేటి యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చి మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీయవద్దని ఆశిద్దాం. .

# సమగ్ర విద్యతోనే సమసమాజం



విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే జ్ఞాన ప్రక్రియ. అది కేవలం పాఠశాలల్లో, కళాశాలలో పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, మనస్సును, ఆలోచనలను, ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అతి పెద్ద జీవన పద్ధతి. విద్య అనేది మనిషిని లోపల నుంచి మార్చే మహోన్నత మార్గం. నైపుణ్యంతో ముందుకు నడిపిస్తుంది, నీతి విలువలతో సరైన మార్గం చూపిస్తుంది. నవచైతన్యంతో ప్రపంచాన్ని మార్చే ధైర్యం ఇస్తుంది. ఈ మూడు లక్షణాలు కలిసినప్పుడే వ్యక్తి సంపూర్ణంగా ఎదుగుతాడు. సమాజం అభివృద్ధి చెందుతుంది. దేశం ముందుకు సాగుతుంది.విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం పుస్తకాల జ్ఞానం లేదా పరీక్షల మార్కుల వరకే పరిమితం కాదు. నిజమైన విద్య అంటే మనిషి ఆలోచనా విధానాన్ని మార్చేశక్తి, జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకం.నేటి వేగవంతమైన ప్రపంచంలో నైపుణ్యాలు, నీతి, నవచైతన్యం వంటి మూడు ముఖ్యాంశాలు ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమైనవి. ఇవన్నీ కలిగినప్పుడు మాత్రమే వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యమవుతుంది. ఈ పరిపూర్ణతను అందించే మార్గమే సమగ్ర విద్య. కానీ పుస్తకాల్ని కంఠస్థం చేసే విద్యతో ఉద్యోగాలు కూడా రాకపోవడం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. కాబట్టే విద్యా వ్యవస్థ నైపుణ్యాల పెంపువైపు మళ్లాలి. పాఠశాల స్థాయినుండే ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను బలపరచాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థి ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలను సృష్టించగలడు. నీతి వ్యక్తిత్వ వికాసానికి నిత్యావసరం, నైపుణ్యాలు ఉన్నప్పటికీ విలువలు లేకపోతే వ్యక్తి సమాజానికి హానికరుడు అయిపోతాడు. నీతి అనే విలువ మనిషిని లోపలినుంచి మార్చుతుంది. నిజాయితీ, దేశభక్తి, బాధ్యతా భారతం, పరస్పర గౌరవం, కరుణ, సేవాభావం ఇవన్నీ నీతి ద్వారా వచ్చే అంశాలు. ప్రస్తుత కాలంలో విలువలు తగ్గిపోతున్నాయని మనం ప్రతిరోజూ చూస్తున్నాం. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మానవత్వం తగ్గిపోకుండా చూసుకోవడం కూడా విద్యా వ్యవస్థ బాధ్యతే. విలువల పాఠాలు, కథలు, సమాజ సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, గురుశిష్య సంబంధాలపట్ల గౌరవం ఇవన్నీ విద్యార్థుల్లో నీతిని పెంపొందించగల అంశాలు. మంచి విలువలతో ఉన్న విద్యార్థి భవిష్యత్తులో మంచి పౌరుడిగా మారతాడు. నవ చైతన్యం అభివృద్ధికి కొత్త దారి, భవిష్యత్తు నవ చైతన్యాన్ని కోరుతోంది. కొత్త ఆలోచనలు, కొత్త ప్రయోగాలు, కొత్త పరిష్కారాలే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం అనేది సమగ్ర విద్యలో కీలక అంశం. కేవలం పాఠాలు నేర్పించడంసరిపోదు. ఆ పాఠాలపై సందేహాలు అడగడం, కొత్త ప్రయోగాలు చేయడం, వైఫల్యం భయపడకుండా ముందుకుసాగడం వంటి ధైర్యం విద్యార్థికి ఉండాలి. ల్యాబ్‌లు, ఇన్నోవేషన్ క్లబ్‌లు, సైన్స్ ఫెయిర్‌లు, స్టార్టప్ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవన్నీ నవచైతన్యాన్ని పెంపొందించే మార్గాలు. నవ చైతన్యంతో ఉన్న విద్యార్థి ఉద్యోగం కోసం వెతకడు, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటాడు. సాంకేతిక రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతిచోటా ఈ సృజనాత్మక ఆలోచనకు అవసరం పెరిగింది. సమగ్ర విద్య అనేది విద్యార్థిని ఒకే కోణంలో కాకుండా పలు కోణాలలో ఎదగనిచ్చే ప్రక్రియ. అందులో విద్యా జ్ఞానం, సృజనాత్మకత, నైతికత, సామాజిక బాధ్యత, శారీరక ఆరోగ్యం, భావోద్వేగ పరిపక్వత అన్నీ సమపాళ్లలో ఉండాలి. పుస్తకాల జ్ఞానంతోపాటు జీవితానికి అవసరమైన విలువలను నేర్పడం, నైపుణ్యాలను పెంపొందించడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే ఆలోచనను పోషించడం ఇవన్నీ సమగ్ర విద్య లక్ష్యాలు. సమగ్ర విద్య ఎందుకు అవసరం అంటే సమాజంలో మార్పులు వేగంగా జరుగుతున్న ఈ యుగంలో సమగ్ర విద్య అనేది చాలా కీలకం. ఎందుకంటే ఇది వ్యక్తిని జ్ఞానం కలిగినవాడిగా, నైపుణ్యం ఉన్నవాడిగా, విలువలు పాటించే పౌరుడిగా, సృజనాత్మక ఆలోచకుడిగా మారుస్తుంది. దేశ అభివృద్ధికి ఇలాంటి పౌరులే అవసరం.

పాఠశాలల నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు సమగ్ర విద్యను అమలు చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, బాధ్యత గల, ఆవిష్కరణాత్మక యువత పెరిగి దేశాన్ని ముందుకు నడిపించగలుగుతుంది. విద్య అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని, దేశాన్ని కూడా మార్చగల మహాశక్తి. నైపుణ్యం, నీతి, నవ చైతన్యం ఈ మూడు అంశాలు ఏ ఒక్కరి జీవితాన్నైనా సార్థకంగా మార్చగలవు. కానీ ఇవన్నీ ఒకే చోట పొందాలంటే సమగ్ర విద్య తప్పనిసరి అవసరం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో మార్పులు వేగం పుంజుకుంటున్నాయి. నూతన యుగ అవసరాలకు అనుగుణంగా పాఠశాలలనుండి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అభ్యాసం వంటి అంశాలు ప్రముఖ స్థానం సంపాదిస్తున్నాయి. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వాన్ని అన్ని కోణాల్లో అభివృద్ధి చేసే సమగ్ర ప్రక్రియ కావాలని సూచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాల్లో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో కొత్త కార్యక్రమాలు, నైపుణ్య ఆధారిత కోర్సులు, సాంకేతిక పరికరాల వినియోగం పెరగడంతో విద్యార్థుల అభ్యాస పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, విలువల విద్య వంటి అంశాలను తరగతులలోకి తీసుకువస్తూ పాఠశాలలు విద్యార్థులను భవిష్యత్తు వైపు తీర్చిదిద్దుతున్నాయి. విద్యా నిపుణులు చెబుతున్నదేమిటంటే, నేటి తరం ఉద్యోగాలకే కాదు, జీవితానికి సిద్ధం అవ్వాలి. మొత్తం మీద విద్యా రంగంలో జరుగుతున్న ఈ మార్పులు సమీప భవిష్యత్తులో దేశ యువతకు మరింత బలమైన భవిష్యత్తును అందించనున్నాయి. విద్యార్థులు నైపుణ్యవంతులుగా, విలువలను పాటించే పౌరులుగా, కొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఈ సంస్కరణలు మేలుచేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి నేటి తరానికి సరైన విద్య అంటే కేవలం పుస్తకాలు కాదు, మంచి విలువలు, జీవిత నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కరణ, ఆధునిక జ్ఞానం ఇవన్నీ కలగలిపిన బహుముఖ విద్య సమగ్ర విద్యను ప్రతి విద్యా సంస్థలో అమలు చేసినప్పుడే మన దేశం నిజమైన అర్థంలో విజ్ఞానభారతంగా వెలుగొందుతుంది.

# వేసవిలో త్రాగునీటి సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని కార్మిక కుటుంబాలకు త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ సూచించారు.బుధవారం సింగరేణి ఆర్జీ--వన్ ప్రాంత ప్రధాన నిర్వాహక అధికారి లలిత్ కుమార్‌తో కలిసి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్) ఆర్జీ--వన్ పరిధిలోని గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన నీటి శుద్ధి పడకను, అలాగే నదిలోని నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా వేసవిలో నీటి మట్టాలు తగ్గే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పారిశ్రామిక ప్రాంతంలో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు త్రాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు అవసరమైన యంత్రాంగాన్ని సమర్థంగా నిర్వహించాలని తెలిపారు.నీటి శుద్ధి పడకల సంరక్షణ, పైపుల మార్గాల మరమ్మతులు, మోటార్ల



పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడితే వేసవిలో నీటి కొరత సమస్య తలెత్తదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖర్జూర పండ్లు పంపిణీ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి మండలం లోని అన్ని గ్రామాలలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో మండలశీ లోని మరియు గ్రామాల ముస్లిం సోదరులకు కుటుంబ సభ్యులకు ఖర్జూర పండ్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో ఖర్జూర పండ్లు పంపిణీ చేయడం జరుగుతుంది అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

## బీసీ సంఘాశీ ఆధ్వర్యంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ రత్నమాల ఆనంద్ కుమార్ కి సన్మానం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోనే మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఇంటి వద్ద కల్వకుర్తి బీసీ సంఘాల నాయకులు బిసి ఉద్యోగుల సంఘం నాయకులు, బీసీ ఉద్యమకారుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో నూతన కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, బీసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కాటమయ్య గుడి నిర్మాణానికి చేయూత

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల మండలం అవురు పల్లి గ్రామానికి చెందిన చైర్మన్ రవి కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, నారాయణ గౌడ్, లాలయ్య గౌడ్, నరసింహ గౌడ్, అధ్యక్షుడు కేశముని శ్రీనివాస్ గౌడ్ ద్వారా ఉప్పల వెంకటేష్ సహకారంతో అందుగుల గ్రామంలో కాటమయ్య గుడి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి గుడి నిర్మాణం కోసం తన ట్రస్టు ద్వారా సిమెంట్ 200 బస్తాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ మా గుడి నిర్మాణానికి సహకరించిన తలకొండపల్లి మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ రవి కుమార్ గౌడ్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ జనరల్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్ పెద్దలు నారాయణ గౌడ్ నరసింహ గౌడ్ అధ్యక్షులు కేశముని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు

# గోదావరిఖనిలో ఘనంగా హోలీ సంబరాలు

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తాలో బుధవారం ఉదయం నిర్వహించిన హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. రంగుల కేళిలో చిన్నా--పెద్దా తేడా లేకుండా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన పాలకవర్గం ప్రజలతో మమేకమై పారదర్శక పాలన అందిస్తుందని పేర్కొన్నారు. రామగుండం నగరం 2029 నాటికి సకల సౌకర్యాలతో సంపూర్ణ అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో స్థానిక శాసనసభ్యుడు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రూ.800 కోట్ల వ్యయంతో నగరంలో పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజల సహకారం ఉంటే మరింత వేగంగా పురోగతి సాధించవచ్చని



ఆకాంక్షించారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నిక

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి,మార్చి 04:(ప్రెస్ క్లబ్ న్యూస్)** జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో నిర్వహించిన పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో 2026-28 రెండేళ్ల కాల పరిమితికి గాను నూతన కార్యవర్గాన్ని బుదవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా మెతుకు తిరుపతి ఉపాధ్యక్షులుగా నీలం నరేందర్,తాళ్ళ నరేందర్,ప్రధాన కార్యదర్శిగా సట్టు కనకయ్య,ఆర్థిక కార్యదర్శిగా కర్రె ప్రవీణ్ ప్రచార కార్యదర్శిగా అలుగం కనకయ్య, గౌరవ అధ్యక్షులుగా వాలుక హనుమంతు,గౌరవ సలహాదారుగా చాట్ల ఆగయ్య, కార్యవర్గ సభ్యులుగా ఒల్లే శ్రీనివాస్ యాదవ్,రామగిరి స్వామి వడ్డేపల్లి రాజేషం,కర్నె రాజు,సుంకే నర్సింగంలు నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మెతుకు తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.పెద్దపల్లిలో



నివాసం ఉంటున్న ఉపాధ్యాయులందరినీ ఒక్క తాటిపైకి తెచ్చి,వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన ప్రకటించారు.ఈ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారి హనుమంత్ కు, సహకరించిన పెద్దలకు,కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వెసి శాలువాలతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు.

# సైబర్ మోసాలకు చెక్

**అప్రమత్తతే రక్షణ**

అగ్ని ధార న్యూస్,( రామగుండం): సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సైబర్ జాగృతి కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పోలీసుల సమన్వయంతో మార్చి నెల మొదటి బుధవారం 'సైబర్ జాగృతి దివస్' సందర్భంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. డిజిటల్ యుగంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. సైబర్ మోసాలు, ఫిషింగ్ కాల్స్, ఓటీపీలు పంచుకోవడం వల్ల కలిగే నష్టాలు, నకిలీ లింకులు, సోషల్ మీడియా మోసాలపై సమగ్ర అవగాహన కల్పించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆకర్షణీయమైన ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని



సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ వెల్లడించరాదని స్పష్టం చేశారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.సైబర్ భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని పోలీసులు తెలిపారు.

# మెట్ పల్లిలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు

**వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**

**అగ్నిధార న్యూస్ (మెట్ పల్లి):** హోలీ పండుగ సందర్భంగా మెట్ పల్లిలో వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలో జరిగిన వేడుకల్లో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీ నేతలు, కుల, యువజన సంఘాలతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లికి చెందిన



పలువురు రాజకీయ నాయకులు, కుల, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## డివిజన్ ప్రజలతో హోలీ సంబరాలు

**... కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్‌లో హోలీ సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. డివిజన్ ప్రజల మధ్యలోనే ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ రంగులు పూసుకుంటూ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, యువకుల కేరింతల నడుమ హోలీ వేడుకలు ఆనందోత్సాహాలతో కొనసాగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హోలీ పండుగ సందర్భంగా డివిజన్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ ప్రజల మధ్య కుటుంబసభ్యుల్లా కలిసి పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన భగవంతునికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గుర్రాల మల్లేష్ యాదవ్, ఒకటవ డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కనీస వేతనాల అమలుకు చొరవ తీసుకోండి

**: జనక్ ప్రసాద్**



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం దృష్ట్యా కనీస వేతనాలను త్వరితగతిన అమలు చేసేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్ కోరారు. హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం అంజయ్య భవన్‌లో నూతనంగా కార్మిక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పామెలా సత్పథిను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్మిక కమిషనర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన పరిణామాలు, నిర్వహించిన సమావేశాలు, అమలు చర్యలను జనక్ ప్రసాద్ వివరించారు. రాష్ట్రంలో సుమారు కోటి ముప్పై లక్షల మంది కార్మికులకు న్యాయం చేయాలంటే కనీస వేతనాల అమలు కీలకమని పేర్కొన్నారు. సమావేశంలో కనీస వేతన సలహా మండలి కార్యదర్శి జాజు, సభ్యులు నరసింహారెడ్డి, రాజు ముదిరాజు, అలాగే ఐ ఎన్ టి యు సి కేంద్ర ఉపాధ్యక్షుడు త్యాగరాజన్ పాల్గొన్నారు.

## ఆర్థిక ప్రాతిపదిక రిజర్వేషన్లు ప్రమాదకరం

**పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమోక్రటిక్..**

**అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్):** రాజ్యాంగబద్ధంగా అమలులో ఉన్న రిజర్వేషన్ విధానం సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని ఆధారంగా చేసుకుని ఏర్పాటైందని, ఆర్థిక ప్రాతిపదికపై రిజర్వేషన్లు ప్రవేశపెట్టడం వల్ల ప్రస్తుత వ్యవస్థకు ముప్పు వాటిల్లే అవకాశముందని పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమోక్రటిక్ (తెలంగాణ రాష్ట్రం) అభిప్రాయపడింది.ఆ పార్టీ నాయకుడు డా. డి. శేషగిరిరావు మాట్లాడుతూ బహుజన సమాజ మహనీయుల ఉద్యమాలు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కృషి ఫలితంగానే రాజ్యాంగంలో సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని ప్రాతిపదికగా చేసుకుని ప్రాతినిధ్య (రిజర్వేషన్) విధానం అమలులోకి వచ్చిందన్నారు. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ల అంశం రాజ్యాంగంలో ఎక్కడా ప్రస్తావించలేదని స్పష్టం చేశారు.భారత సమాజ నిర్మాణం సామాజిక (కుల) ప్రాతిపదికన ఉందని, వర్ణవ్యవస్థ, అంటరానితనం వంటి సమస్యలు సామాజిక ఆధారంగానే కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తే ఎస్సీ, ఓబీసీ వర్గాల హక్కులకు భవిష్యత్తులో భంగం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లు అమల్లోకి వస్తే సామాజిక, విద్యా వెనుకబాటుతనంపై ఉన్న చట్టాలకు ఆటంకాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. బహుజన సమాజ నాయకులు, మేధావులు దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్పందించాలని పిలుపునిచ్చారు.

# బల్క సుమన్‌కు పెద్దపల్లిలో ఘన స్వాగతం



**అగ్ని ధార న్యూస్,(పెద్దపల్లి):** జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్కు పెద్దపల్లిలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్‌కు వెళ్తున్న మార్గంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న ఆయనకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సంఘీభావం తెలియజేస్తూ స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇటీవల చెన్నూరు నియోజకవర్గంలోని కేతనపల్లి మున్సిపాలిటీలో జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. చైర్మన్ ఎన్నికను ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో అక్రమ కేసులు నమోదు చేసి సుమన్‌ను అదిలాబాద్ జైలుకు పంపినట్లు వారు పేర్కొన్నారు. స్వాగత కార్యక్రమం అనంతరం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపుతో బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేయబోమని, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# వార్డు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి





## మేయర్ మహంకాళి స్వామి

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** వార్డు అధికారులు ప్రజలకు, నగర పాలక సంస్థకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని మహంకాళి స్వామి సూచించారు. బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. 'స్వచ్ఛ రామగుండం' లక్ష్యంతో సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తి పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి నెలాఖరులోగా వందశాతం పన్నులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. రోజువారీగా పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నీటి బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ రుసుములు కూడా లక్ష్యానికి అనుగుణంగా వసూలు చేయాలని సూచించారు. నగర పాలక సంస్థ ఆదాయ వనరులను పెంపొందించే దిశగా కృషి చేయాలని, కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని మేయర్ తెలిపారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి. రామన్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరు సార్.....765 కె వి హైటెన్షన్ లైన్ల బాధిత రైతులకు న్యాయం చేయండి

### కడ్తాల్ రైతులతో కలిసి జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం

### సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** రైతుల పొలాల గుండా 765 కె వి హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు,తీగలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం, పలు గ్రామాల మీదుగా 765 కె వి బీదర్ - మహేశ్వరం నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. హైటెన్షన్ విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని బుధవారం రైతులతో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో వ్యవసాయ భూముల వినియోగాన్ని ప్రభావితం చేస్తుందని, పంట ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. కడ్తాల్ గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందుతుండ డంతో గ్రామానికి సమీపాన విద్యుత్ లైన్ ఏర్పాటుతో అభివృద్ధి ఆగిపోతుందని తెలిపారు. ఈ మేరకు రైతులకు న్యాయం చేసే విధంగా పై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో రైతులు తమ పొలాలను వ్యవసాయానికి వినియోగించుకోకపోగా, క్రయవిక్రయాలకు కూడా వీలు లేకుండా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హై టెన్షన్ స్తంభాలు మరియు విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం జరిగేంతవరకు రైతుల పక్షాన పోరాడతామని, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ ,గుదే రాములు యాదవ్ గూడూరు జంగా రెడ్డి,గూడూరు పెంటారెడ్డి,క్యాతిక కృష్ణయ్య కందికంటి శ్రీరాములు, గుదే పర్వత్ కుమార్ యాదవ్, గిరి యాదవ్, గోరేటి శ్రీశైలం,గోరేటి చంద్రశేఖర్ జంగయ్య యాదయ్య కేశవులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేటికీ వీడని.. రైతన్నకు యూరియా కష్టాలు

### పంట కు సరిపడ యూరియా అందించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలంలో రైతులను యూరియా కష్టాలు వీడటం లేదు. సర్కార్ నిర్వాకంతో ఎన్నడూ లేని విధంగా రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా తీసుకొచ్చిన యాప్‌పై అవగాహన లేకపోవడంతో సతమత మవుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, పాత పద్ధతి ప్రకారం పాస్ బుక్ ల ద్వారా యూరియా అందించాలని వారు కోరారు. ఒక వేళ యాప్‌లో బుక్ చేసుకున్నా క్షణాల్లో నో స్టాక్ చూపిస్తోంది. దీంతో చేసేదేమీ లేక డబ్బులు ఎక్కువైనా కొందరు యూరియా లిక్విడ్ వాడాల్సిన పరిస్థితి దాపురించింది మండల కేంద్రాల్లో బస్తాల కోసం ప్రదక్షిణలు నిత్యం రైతన్నల ఆందోళనలు కట్ట యూరియా కోసం యాప్‌సోపాలు బుకింగ్‌పై అవగాహన లేక తప్పని తిప్పలుబుక్ చేసుకున్నా.. క్షణాల్లో స్టాక్ ఖాళీ రైతులను యూరియా కష్టాలు వీడటంలేదు. సర్కార్ నిర్వాకంతో ఎన్నడూ యాప్‌పై అవగాహన లే దీంతో చేసేదేమీ లేక డబ్బులు ఎక్కువైనా కొందరు యూరియా లిక్విడ్ వాడాల్సిన పరిస్థితి దాపురించింది. కొంత మంది అవసరం లేకున్నా కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారని పేర్కొంటున్నాయి. ఐదెకరాల్లోపు ఒక దఫా, ఆపై ఉంటే రెండు దఫాలుగా స్టాక్ ఇస్తున్నారు. ఒక్కో ఎకరాకు రెండు నుంచి రెండున్న బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. ఇక ఉదయం 10 గంటలకు యూరియా బుకింగ్ కోసం యాప్ ఓపెన్ అవుతుంది. ఓపెన్ అయిన క్షణాల్లోనే యూరియా ఔట్ ఆఫ్ స్టాక్ అని చూపిస్తుండటంతో రైతులు లబోదిబోమణి అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సరిపడ యూరియా అందించి ఆదుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్చాల సర్పంచ్ కృష్ణ రెడ్డి,రైతులు పర్వత్ రెడ్డి,రామస్వామి, బీశిరెడ్డి,శ్రీను,రమేష్, లక్ష్మయ్య, బీరయ్య, యాదగిరి,వెంకటయ్య, రవి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి నియోజక వర్గంలో ఘనంగా హోలీ సంబరాలు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి నియోజక వర్గంలోనీ అన్ని మండల కేంద్రం తో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో హోలీ పండుగను ప్రజలు బుదవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే యువత,చిన్నారులు రంగులతో ఒకరిపై ఒకరు చల్లి హర్షోల్లాసాలతో సందడి చేశారు.గ్రామ వీధులన్నీ రంగుల మయం కాగా, పండుగ సందడి నెలకొంది. కామదాహనం కార్యక్రమాన్ని సోమవారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.గ్రామ పెద్దలు,యువకులు పాల్గొని చెడు పై మంచి గెలుపుకు సంకేతంగా కామ దహనం చేశారు. అనంతరం ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పండుగ సందర్భంగా సహజ రంగులు ఉపయోగించాలని, రసాయనిక రంగులను నివారించాలని గ్రామ పెద్దలు సూచించారు. మొత్తానికి హోలీ సంబరాలు శాంతియుత వాతావరణంలో, ఉత్సాహంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో,యువజన సంఘాల నాయకులు యువత చిన్నారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జన్మదినాన్ని సేవా దినంగా మార్చిన లయన్ తాటిపాముల రమేష్

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** తన 54వ జన్మదినాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామగ్రి అందజేసిన లయన్ తాటిపాముల రమేష్ ఆదర్శంగా నిలిచారు. పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణతో పాటు సరైన సిద్ధత అవసరమని సూచించారు. అవసరమైన సామగ్రి అందించడం ద్వారా వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.సామాజిక స్వచ్ఛంద సేవకులు డాక్టర్ దేవి లక్ష్మీనరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేసవి కాలంలో డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా తగినంత నీరు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో హెచ్ఎం కమలాకర్, రఘునందన్ రావు, ఉపాధ్యాయులు, వార్డ్ సభ్యుడు సిరిపురం శ్రీధర్, సదాశివ ఫౌండేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్, తాటిపాముల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ విగ్రహా ఆవిష్కరణ వేదికను పరిశీలించిన న్యాయవాది శర్మ, బృంగి ఆనంద్ కుమార్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోన మార్చి 8న ప్రారంభించబోతున్న ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహా సభ వేదికను పరిశీలించడం జరిగింది. రాష్ట్రస్థాయి ముఖ్య అతిథులు, కళాబృందల యొక్క సందడితో కళాత్మకంగా సభ నిర్వహించబోతున్నామని గద్దర్ విగ్రహా నిర్మాణ కమిటీ చైర్మన్ సీనియర్ న్యాయవాది శర్మ పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో గోపాల్, నర్సిములు , సంజీవ, శేఖర్ ,రజిత, సదానంద గౌడ్ పాల్గొన్నారు

## మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల కేంద్రంలోనీ కంటోనపల్లి గ్రామానికి చెందిన కంఠం కృష్ణయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మృతునికి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి కంటోనపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ బస్నామోని శ్రీనివాస్, వార్డ్ సభ్యులు ముదిగొండ రమేష్ ,కాసరపు వెంకటయ్య ,ఎండి రషీద్ ,ఎండి సమీర్ బాబా ,తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనంలో ధమ్మయాత్ర ముగింపు వేడుకలు విజయవంతం..

**అగ్ని ధార న్యూస్ ,(నాగార్జునసాగర్):** బుద్ధుడి బోధనలను ప్రజల్లో వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ధమ్మయాత్ర ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. బుద్ధవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో థాయ్, భారతీయ భిక్షువులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు."సువర్ణభూమి నుండి బుద్ధభూమి వరకు" అనే అంశంతో చేపట్టిన 3వ ధమ్మయాత్ర ముగింపు కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. బౌద్ధ భిక్షువులతో పాటు బౌద్ధ అనుయాయులు, నిర్వాహకులు, ప్రముఖులు హాజరై బుద్ధుని సందేశాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భిక్షువుల మంత్రోచ్చారణలు, ప్రార్థనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బౌద్ధ సాంప్రదాయాల ప్రకారం మహాపూజలు నిర్వహించారు.నిర్వాహకులు మాట్లాడుతూ బుద్ధుని శాంతి, అహింసా సిద్ధాంతాలను యువతలో వ్యాప్తి చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ కాకతీయ కాలువ ద్వారా సాగునీరు డి-83, డి-86 కాలువలకు పెద్దపల్లి జిల్లా యందు 5వ విడత నీటి విడుదల మార్చి 1వ తేది నాడు ప్రారంభమైనది. ఈ విడతలో 8 రోజుల పాటు అనగా 9 మార్చి వరకు నీటి విడుదల చేయడం జరుగుతుందన్నారు. సాగు నీరు అన్ని కాలువలకు చివరి వరకు అందించుటకు నీటిపారుదల శాఖ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు అని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని రైతులు, సిబ్బందికి సహకరించి తమ పొలాలకు సాగునీరును ఉపయోగించు కోవాలని పెద్దపల్లి జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాస్ ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**పాత పద్ధతినే కొనసాగించాలని రైతులు డిమాండ్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**వెల్దండ మండల కేంద్రంలో యూరియా పంపిణీలో కొత్తగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం మండల కేంద్రంలోని హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులు యూరియా కోసం రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. యూరియా పంపిణీలో కొత్తగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం మండల కేంద్రంలోని హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులు యూరియా కోసం రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. ఇవాళ సొసైటీకి 700 బస్తాల యూరియా వచ్చినట్లు తెలుసుకున్న రైతులు ఉదయాన్నే సొసైటీ వద్దకు రాగా ఆన్లైన్‌లో బుకింగ్ చేద్దామన్నా యూరియా బుకింగ్ కావడం లేదని, ఉదయం టైమ్‌కి కొందరు రైతులు బుకింగ్ చేద్దామన్నా 2, 3 సెకండ్లలో స్టాక్ అయిపోతుందని ఆందోళన చెందుతున్నారు. తమ వద్ద స్మార్ట్ ఫోన్లు లేవని, యాప్ వాడటం తెలియక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అయితే, ఆన్లైన్ యాప్ ద్వారానే యూరియా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగానే యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న మండల వ్యవసాయ అధికారిని శోభారాణి, ఎస్సై కురుమూర్తి ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం స్పష్టత



పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. భారత్ లో చమురు నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ యుద్ధం సుమారు నెలరోజులపాటు కొనసాగవచ్చని చెప్పడంతో.. చమురు నిల్వలపై ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోతే ధరలు గణనీయంగా పెరుగుతాయన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. ధరల పెంపుపై కేంద్రప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి. చమురు, గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేశాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో చమురు నిల్వలు 45 రోజులకు సరిపడా ఉన్నాయని, చమురు దిగుమతి కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని కేంద్రవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఎల్ఎన్ జీ, ఎల్ పీజీ దిగుమతుల కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నట్లు వెల్లడించాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి మూతపడిన విషయం తెలిసిందే. దీంతో వేలాది చమురు షిప్పులు సముద్రంలోనే నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో వేలాది చమురు నౌకలు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకున్నాయి. ఇవన్నీ ఎగుమతి కావాలంటే యుద్ధం ఆగాలి. అందుకు కనీసం 40 రోజులు సమయం పడుతుందని అంచనా. అక్కడి నుంచి చమురు రాకపోతే మనదగ్గరి నిల్వలు అయిపోతే ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్ లో నెలకొన్ని ఉద్రిక్తతల నేపథ్యంలో మనవద్ద పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వార్తల నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. హైదరాబాద్ లో వాహనదారులు వాహనాల్లోనే కాక.. బాటిల్స్ లోనూ పెట్రోల్ ఫిల్ చేయించుకుంటున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# ఫిబ్రవరిలో రూ.1.83 లక్షల కోట్లకు చేరిన స్థూల జీఎస్‌టీ వసూళ్లు




జీఎస్‌టీ వసూళ్లు ఫిబ్రవరి నెలలో భారీగా నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి నెలకు గాను రూ.1.83 లక్షల కోట్ల స్థూల జీఎస్‌టీ వసూలైనట్లు కేంద్రం ఆదివారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు నెలతో పోలిస్తే ఇది 8.1 శాతం అధికం కావడం విశేషం.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫిబ్రవరి 28 నాటికి మొత్తం స్థూల జీఎస్‌టీ ఆదాయం రూ.20.27 లక్షల కోట్లకు చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 8.3 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక ఫిబ్రవరిలో రూ.22,595 కోట్ల రీఫండ్లు చెల్లించారు. రీఫండ్లు సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.61 లక్షల కోట్లుగా నమోదైంది.దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.3 శాతం వృద్ధితో రూ.1.36 లక్షల కోట్లుగా ఉండగా.. దిగుమతుల ద్వారా వచ్చిన రాబడిలో మాత్రం 17.2 శాతం భారీ వృద్ధి కనిపించింది. దిగుమతుల ద్వారా రూ.47,837 కోట్లు సమకూరాయి. అయితే, సెస్ వసూళ్లు మాత్రం ఆందోళనకరంగా తగ్గాయి. గతేడాది ఫిబ్రవరిలో రూ.13,481 కోట్లుగా ఉన్న నికర సెస్.ఈసారి రూ.5,063 కోట్లకు పడిపోయింది.రాష్ట్రాల వారీగా చూస్తే మిశ్రమ ఫలితాలు కనిపించాయి. పారిశ్రామిక రాష్ట్రాల్లో వృద్ధి నమోదు కాగా, వనరుల ఆధారిత రాష్ట్రాల్లో వసూళ్లు తగ్గాయి. మహారాష్ట్ర రూ.10,286 కోట్ల వసూళ్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సానుకూల వృద్ధి నమోదు కాగా.. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఆదాయం తగ్గింది.జీఎస్‌టీ 2.0 తర్వాత వసూళ్లు స్థిరంగా పెరుగుతున్నాయని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ బలంగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దిగుమతుల రాబడి పెరగడం అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాల జోరును సూచిస్తోందని పేర్కొన్నారు.

# అలీబాబా క్వెన్ ఎఐ విభాగం అధిపతి రాజీనామా




చైనా టెక్ దిగ్గజం అలీబాబా గ్రూప్ కు చెందిన క్వెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి లిన్ జున్యాంగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. "బై నా ప్రియమైన క్వెన్," అని ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో సంక్షిప్తంగా పోస్టు చేశారు. అయితే ఆయన కారణాలను వెల్లడించలేదు. ఈ ఏడాది క్వెన్ విభాగాన్ని వీడిన మూడవ సీనియర్ అధికారి లిన్. క్వెన్ పోస్ట్-ట్రైనింగ్ విభాగానికి నాయకత్వం వహించిన యు బోవెన్ కూడా రాజీనామా చేసినట్లు చైనీస్ మీడియా సంస్థ లేట్‌పోస్ట్ తెలిపింది.జనవరిలో కోడింగ్ పరిశోధన శాస్త్రవేత్త హుయ్ బిన్యువాన్ నిష్క్రమించారు. నిష్క్రమణలపై స్పందించేందుకు అలీబాబా అధికారులు స్పందించలేదు. ఇదే సమయంలో హాంకాంగ్ మార్కెట్‌లో అలీబాబా షేర్లు 2.8% తగ్గి ముగిశాయి. మధ్యాహ్న ట్రేడింగ్‌లో 4% వరకు పతనమయ్యాయి. ఇటీవల క్వెన్ నవీకరించిన ఉత్పత్తులను విడుదల చేసిన రెండు రోజులకే ఈ రాజీనామా చోటుచేసుకుంది. క్వెన్ మొబైల్ యాప్ నెలవారీ క్రియాశీల వినియోగదారులు జనవరిలో 31.05 మిలియన్ల నుంచి ఫిబ్రవరిలో 203 మిలియన్లకు పెరిగినట్లు ఎఐసిపిబి వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఓపెన్ ఎఐ యొక్క 'చాట్ బాట్' మరియు బైట్ డాన్స్ డౌబావో యాప్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలో ఉంది. 2023 నుంచి అలీబాబా 400కు పైగా ఓపెన్ సోర్స్ 'క్వెన్' మోడళ్లను విడుదల చేసింది. ఈ మోడళ్లు ఇప్పటివరకు ఒక బిలియన్ సార్లు డౌన్‌లోడ్ చేయబడ్డాయని సంస్థ పేర్కొంది.

## మద్యం మత్తు లో పడి వ్యక్తి ఆత్మహత్య

**అగ్నిధార న్యూస్ కమన్పూర్** మండలంలోని పేరపల్లి గ్రామానికి చెందిన చెప్పాల దేవేందర్ (38) సంవత్సరాలు అనే వ్యక్తి బుధవారం ఉదయం మృతదేహంగా కనిపించడం స్థానికంగా కలకలం రేపింది.

**ఘటన వివరాల్లోకి వెళ్తే:**

స్థానికులు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరపల్లికి చెందిన దేవేందర్ సింగరేణి నర్సరీ (సెంటినరీ కాలనీ) లో అవుట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు మంగళవారం రాత్రి పది గంటల సమయంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లిన ఆయన, తిరిగి రాలేదు. ఉదయం గుండారం గ్రామం సమీప ప్రాంతంలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు.

**కుటుంబంలో తీరని లోటు:**

మృతుడికి భార్య, ఒక కుమారుడు మరియు ఒక కుమార్తె ఉన్నారు. కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తి ఇలా అకాల మరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మరణానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది

## గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**99 రోజుల ప్రభుత్వ కార్యాచరణ అమలుపై**

**ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి , మార్చి-04:** గ్రామీణ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో 99 రోజుల ప్రభుత్వ కార్యాచరణ అమలుపై జిల్లాలోని ఎంపీడీవో లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యచరణను గ్రామ స్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మార్చి 6 నుంచి 16 వరకు పెండింగ్ ఉన్న ఫైల్స్ క్లియర్ చేయాలని అన్నారు.99 రోజుల కార్యక్రమం సంబంధించి గ్రామస్థాయిలో ఏప్రిల్ 2న సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని అంతకంటే ముందే వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వచ్చే షెడ్యూల్ తూచా తప్పకుండా అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుదల వంటి వివిధ అంశాలపై దృష్టి సారించాలి అన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, ఈఈ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలి



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష


**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి , మార్చి- 4:** జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారుజాతీయ కుటుంబ ప్రయోజనం పథకం అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. బి.పి.ఎల్ కుటుంబాలలో కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు మరణిస్తే వారు కుటుంబానికి ఈ పథకం కింద 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

ఈ పథకానికి సంబంధించి మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇతర ఆర్థిక సహాయాలు అందకుండా ఉండాలని , అప్పుడే ఈ పథకం అమలు అవుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భారత్ ఫైనల్ గురి

**నేడు ఇంగ్లండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్**

గత టి20 ప్రపంచ కప్‌లో భారత్ విజేతగా నిలిచిన సందర్భంలో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌ను ఓడించే ముందంజ వేసింది. అంతకుముందు 2022 సెమీఫైనల్లో భారత్‌పై విజయం సాధించిన ఇంగ్లండ్ ఆపై టైటిల్‌నూ సొంతం చేసుకుంది. ఇప్పుడు మరోసారి టైటిల్ పోరుకు ముందు ఈ రెండు జట్లు వరుసగా మూడోసారి సెమీస్ సమరంలోనే ముఖాముఖికి సిద్ధమయ్యాయి. తాజా టోర్నీలో ప్రదర్శనను బట్టి చూస్తే రెండు జట్లూ కూడా 'లోపాలు లేని అత్యుత్తమ ఆటతీరు'ను కనబర్చలేకపోయాయి. ఇంగ్లండ్ ప్రస్థానం తడబడుతూనే సాగగా... భారత్ కూడా తమపై ఉన్న భారీ అంచనాలకు అనుగుణంగా ప్రత్యర్థులపై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయింది. అయితే ఇక్కడి వరకు ఎలా వచ్చామన్నది ముఖ్యం కాదు మిగిలిన రెండు మ్యాచ్‌లు ఎలా గెలవడం అనేదే ముఖ్యం.



# రామ్ చరణ్ పెద్ది మూవీ.. 24 గంటల్లోనే రికార్డ్

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన చికిరి చికిరి సాంగ్ ఆడియన్స్‌ను ఓ ఊపు ఊపేసింది. వ్యూస్ పరంగా రికార్డ్ స్థాయిలో దూసుకెళ్లింది. తాజాగా రిలీజైన రై రై రారా అంటూ సాగే సాంగ్ సైతం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ పాట రిలీజైన కొన్ని గంటల్లోనే అత్యధిక వ్యూస్‌తో దూసుకెళ్తోంది. ఈ సాంగ్ విడుదలైన 24 గంటల్లోనే 31 మిలియన్ల వ్యూస్, 5లక్షల 30వేల లైక్స్‌ను సొంతం చేసుకుంది. కాగా.. ఈ పాటకు అనంత శ్రీరామ్ లిరిక్స్ అందించగా.. ఏఆర్ రెహమాన్ పాడారు. ఈ మోటివేషనల్ సాంగ్‌ను రెహమాన్ కంపోజ్ చేశారు. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా ఏప్రిల్ 30న థియేటర్లలో సందడి చేయనుంది.



# మనుషుల కంటే అడవే నయం

సినిమా షూటింగ్‌లు, గ్లామర్ మెరుపులు, వందల మంది మనుషుల మధ్య బిజీగా గడిపే నటి మాళవిక మోహనన్‌లో ఒక అద్భుతమైన వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ దాగి ఉన్నారు.తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె జంతువుల పట్ల తనకున్న ప్రేమను పంచుకున్నారు. జపాన్‌కు చెందిన 'పంచ్' అనే బేబీ కోతిని దాని తల్లి వదిలేసిన ఉదంతం తనను ఎంతగానో కదిలించిందని ఆమె పేర్కొన్నారు. వన్యప్రాణుల ఫోటోగ్రఫీ అంటే కేవలం కెమెరా పట్టుకుని వెళ్లడం కాదు, అది ఒక తపస్సు అని మాళవిక అన్నారు. "అడవిలోకి వెళ్లినప్పుడు మనం అక్కడ అతిథులం మాత్రమే, ఆక్రమణదారులం కాదు. జంతువుల దగ్గరకు వెళ్లేటప్పుడు మనకు ఏదో హక్కు ఉన్నట్లు ప్రవర్తించకూడదు. వాటిని గౌరవించాలి. అడవి మనకు నేర్పే అతిపెద్ద పాఠం ఓపిక . ఒక్కోసారి 12 గంటలు వేచి చూసినా ఏ జంతువు కనిపించకపోవచ్చు,

# వ్యూస్ కోసం ఎంతకైనా తెగిస్తారా?

గతేడాది విడుదలైన రణవీర్ సింగ్ సినిమా 'ధురంధర్'లో అయేషా ఖాన్, క్రిస్టల్ డిసౌజా కలిసి ఒక హిట్ సాంగ్‌లో మెరిశారు. కరాచీ వెడ్డింగ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పాట షూటింగ్ సమయంలో తనకు పీరియడ్స్ ఉన్నాయని, ఆ నొప్పిని భరిస్తూనే చాలా కష్టపడి డ్యాన్స్ చేశానని అయేషా గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే, ఆమె చేసిన ఈ వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో మీమ్స్ చేస్తూ ఎగతాళి చేశారు. తాజాగా, ఈ విషయంపై అయేషా స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. "ప్రస్తుత రోజుల్లో ప్రతి విషయాన్ని జోక్ చేయడం, డార్క్ హ్యూమర్ పేరిట నవ్వుకోవడం ఒక ఫ్యాషన్ అయిపోయింది. అన్నిటికీ నవ్వడం మంచిది కాదు. పీరియడ్స్ అనేది ప్రతి నెల మహిళలకు వచ్చే సహజమైన ప్రక్రియ. ఆ సమయంలో కూడా మేము ఎన్నో పనులు చేస్తుంటాం. నాకు అది పెద్ద విషయంగా అనిపించలేదు కాబట్టే ఇంటర్వ్యూలో మామూలుగా చెప్పాను. కానీ వారం రోజుల తర్వాత చూస్తే నా కామెంట్ ఒక నేషనల్ జోక్ అయిపోయింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ జోకులన్నీ మగవాళ్లే వేసి ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు. "మనం మన కొడుకులకు, అన్నదమ్ములకు ఈ విషయాల గురించి అవగాహన కల్పించాలి. 'ఆదిత్య ధర్ పీక్ డీటెయిలింగ్ ఇచ్చారు' అంటూ నా పీరియడ్స్ మీద జోకులు వేయడం చాలా దారుణం. కానీ నేను సిగ్గుపడటం లేదు. పీరియడ్స్ టైమ్‌లో అంత కష్టపడి డ్యాన్స్ చేసినందుకు నేను గర్వపడుతున్నాను.






# క్రేజీ కళ్యాణం: 'సూపర్ మ్యాన్' బాలరాజుగా తరుణ్ భాస్కర్ సందడి!

ఒకవైపు మెగాఫోన్ పట్టి సినిమాలు తెరకెక్కిస్తునే మరోవైపు వరుస సినిమాలు చేసుకుంటుపోతున్నాడు టాలీవుడ్ యువ దర్శకుడు తరుణ్ భాస్కర్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం' హోలీ పండుగను పురస్కరించుకుని ఈ చిత్రం నుంచి చిత్ర బృందం ప్రేక్షకులకు అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమా నుండి టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేస్తూ, ఆయన పోషిస్తున్న 'బాలరాజు' పాత్రను పరిచయం చేశారు. ఈ పోస్టర్‌లో తరుణ్ భాస్కర్ 'సూపర్ మ్యాన్' గెటప్‌లో కనిపిస్తూ సందడి చేస్తుండగా, సినిమాలో ఆయన క్యారెక్టర్ ఎంత ఫన్నీగా మరియు ఎనర్జిటిక్‌గా ఉండబోతుందో క్లియర్ హింట్ ఇచ్చారు. తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో తరుణ్ భాస్కర్ మార్క్ కామెడీ మరియు డైలాగ్ డెలివరీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. యారో సినిమాస్ పతాకంపై బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ క్రేజీ ఎంటర్‌టైనర్‌లో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు నరేష్ వీకే, అఖిల్ రాజ్ ఉద్దెమారి, చైతన్య రావు ఇతర ముఖ్య పాత్రల్లో మెరుస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ దూపాటి కెమెరా బాధ్యతలు, శ్రవణ్ కటికనేని ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పెళ్లి చుట్టూ తిరిగే ఒక ఫుల్ లెంగ్త్ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. తరుణ్ భాస్కర్ మేనరిజమ్స్ మరియు అనుపమ పరమేశ్వరన్ గ్లామర్ తోడవడంతో 'క్రేజీ కళ్యాణం'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఈ కథ వెనుకున్న ఆలోచన అదే



వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం 'సరస్వతి'. హై-కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులలో క్యురియాసిటీ పెంచింది. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుండగా.. నిర్మాత పూజా శరత్ కుమార్ సినిమా విశేషాలు పంచుకున్నారు. 'సరస్వతి మంచి థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ట్విస్టులు ఉన్న వన్ ప్యాకేజ్ పటాక. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు. రెండు గంటల సినిమాని ఎంత గ్రిప్పింగా చేయాలో అంత అద్భుతంగా తీర్చిదిద్దాం. వరలక్ష్మి మంచి విజన్‌తో ప్రియమణి క్యారెక్టర్‌ని డిజైన్ చేసింది. ఆ క్యారెక్టర్‌కి ప్రియమణి పర్ఫెక్ట్ యాప్ట్. చాలా మంచి పెర్ఫార్మన్స్ ఇచ్చారు. సరస్వతి క్రైమ్ థ్రిల్లర్. చాలా మంచి సోషల్ మెసేజ్ ఉంది. ఈ ట్రైలర్‌లో ప్రతి అమ్మాయి సరస్వతి లాగా ఉండదు సమయం వస్తే కాళీలా మారుతుంది అనే ఒక డైలాగ్ ఉంది. ఈ కథ వెనుక ఉన్న ఆలోచన అదే. ఒక స్ట్రాంగ్ విమెన్ క్యారెక్టర్ ఇందులో చూస్తారు. చాలా బలమైన కథ ఇది. సినిమా చూస్తున్నప్పుడు ఆడియన్స్ కథకి చాలా కనెక్ట్ అవుతారు' అని చెప్పుకొచ్చారు.